విశాఖపట్టణం
గురువారం 20 ఆగస్టు 2026
For a pure tomorrow..
జయ జయహే
epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 208 వెల: రూ.5/- పేజీలు: 8
Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

మున్సిపల్ ఎన్నికలకు

# గ్రీన్ సిగ్నల్

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలంటూ ప్రభుత్వ జీఓ జారీ

బీసీలకు కొత్త రిజర్వేషన్లు అమలు

2025 ఓటర్ల జాబితాతో ఎన్నికలకు

నెలాఖరులోగా పోలింగ్ కేంద్రాల ప్రక్రియ పూర్తి

2



ప్రిన్సిపాల్‌ను చంపేసిన

# టెన్త్ స్టూడెంట్స్

నల్గొండ జిల్లాలో దారుణ ఘటన

మద్యానికి బానిసలై, డబ్బు కోసం హత్య

ఇద్దరు విద్యార్థులు అరెస్టు

ఫోన్ సంభాషణతో కేసును ఛేదించిన పోలీసులు

(నల్గొండ - జయజయహే)

నల్గొండ జిల్లా వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన స్కూల్ ప్రిన్సిపాల్ కల్లు రూపారెడ్డి దారుణ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఘటన జరిగిన కొద్ది రోజుల్లోనే పక్కా ఆధారాలతో నిందితులను గుర్తించి కటకటాల్లోకి నెట్టారు. డబ్బుపై ఆశతో పాటు ప్రిన్సిపాల్‌పై పెంచుకున్న కక్షే ఈ ఘాతుకానికి కారణమని విచారణలో తేలింది. ఈ దారుణానికి ఒడిగట్టిన ఇద్దరు పదో తరగతి మైనర్ విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సైంటిఫిక్ దర్యాప్తు, సీసీటీవీ ఫుటేజ్, ఫోరెన్సిక్ ఆధారాలు మరియు సాంకేతిక విశ్లేషణ ఈ కేసును ..మిగతా 2లో

# డేటా సెంటర్లపై అపోహలు వద్దు

6.5 గిగావాట్ల డాటా సెంటర్ల లక్ష్యం పూర్తి

పోలవరం నుంచి విశాఖకు తాగు, సాగు, పరిశ్రమలకు నీరిస్తున్నాం

పారిశ్రామిక కేటాయింపుల నుంచే డేటా సెంటర్లకు నీరు

విశాఖకు ఐటీ సంస్థలు క్యూ

రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్





(అమరావతి- జయజయహే)

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 6.5 గిగావాట్లకు మించకుండా లక్ష్యాన్ని పూర్తి చేశామని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అసెంబ్లీలో డేటా సెంటర్లపై వస్తున్న అపోహలపై నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానమిస్తూ... కొంతమంది కావాలని డేటా సెంటర్లపై అపోహలు సృష్టిస్తున్నారు. గూగుల్ అనే సంస్థ విశాఖ వస్తున్నామని ప్రకటించాకే ఐటి సంస్థలు విశాఖవైపు చూస్తున్నాయి. మనమంతా వాడే స్మార్ట్ ఫోన్ అందులో వినియోగించే ఎఐ డేటా సెంటర్లతో ముడిపడి ఉంది. 1995లో చంద్రబాబు ఐటి నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఆ ప్రక్రియలో పనిచేసే ఎంప్లాయ్ చనిపోయారు. అప్పుడున్న ప్రతిపక్షం వాళ్లు కంప్యూటర్ రేడియేషన్ వల్ల ఆ ఎంప్లాయ్ చనిపోయారని ఆరోపణలు చేశారు. అప్పుడు వెనక్కి తగ్గి ఉంటే, హైదరాబాద్ ఈరోజు ప్రస్తుత స్థాయికి వచ్చేది కాదు. డేటా సెంటర్లపై వస్తున్న అపోహలు కూడా అలాంటివే.

**డేటా సెంటర్‌కు 3 టీఎంసీల నీరు**

డేటా సెంటర్లకు సంబంధించి మాధవి మూడు సమస్యలు చెప్పారు. మొదటిది నీటి భద్రత...గోదావరి నుంచి ఐదేళ్ల సరాసరి తీసుకుంటే సాధారణంగా ప్రతిఏటా 3వేల టిఎంసిల నీరు బంగాళాఖాతంలో వృధాగా పోతోంది. మనం ఆ నీటిలో కొంతభాగాన్ని పోలవరంలోకి మళ్లించి గ్రావిటీ ద్వారా విశాఖకు తీసుకువస్తున్నాం. ప్రస్తుత సాంకేతికత ప్రకారం 6.5 గిగావాట్ల డేటా సెంటర్లు విశాఖలో ఇన్ స్టాల్ అయితే 3 టిఎంసిల నీరు అవసరమవుతుంది. నేను పోలో ఆల్డో ఇంటెల్ ఏర్పాటుచేసిన డేటా సెంటర్ ను స్వయంగా ..మిగతా 3లో

# కరవు కష్టాలు..!?

ఆహార ద్రవ్యోల్బణం పెరిగే ఛాన్స్

2027లో మరింత తీవ్రత

బియ్యం, పప్పులు, పత్తి వరకు ధరలు ఆకాశానికి

ఎరువులు కొరత తారా స్థాయికి

ఎల్ నినో ప్రభావంతో ఆర్థిక భారం

ఆర్థిక సేవలు సంస్థ జేపీ మోర్గాన్ సంస్థ అంచనా

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మరో కీలక సవాలు ఎదురయ్యే అవకాశం ఉందని ప్రముఖ బహుళజాతి ఆర్థిక సేవల సంస్థ జేపీ మోర్గాన్ హెచ్చరించింది. ఎరువుల కొరత, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, బలమైన ఎల్ నినో పరిస్థితులు ఒకేసారి ఎదురైతే 2027లో ప్రపంచవ్యాప్తంగా ఆహార ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం ఉందని తెలిపింది. జేపీ మోర్గాన్ అంచనా ప్రకారం.. 2027 తొలి అర్ధభాగంలో ప్రపంచ ఆహార ద్రవ్యోల్బణం సుమారు 5 శాతానికి చేరుకోవచ్చు. 2026 తొలి అర్ధభాగంలో ఇది 2.8 శాతంగా ఉన్నట్లు ..మిగతా 2లో




# రాజకీయ పార్టీని స్థాపిస్తున్నా..

త్వరలోనే ప్రకటన చేయబోతున్నా

ప్రజావాణిని చట్టసభల్లో వినిపిస్తాం

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కీలక ప్రకటన

(తిరుమల - జయజయహే)



తిరుమల శ్రీవారిని మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి దర్శించుకున్నారు. స్వామివారి ఆశీస్సులు పొందిన అనంతరం ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజల సమస్యలు, ప్రజావాణిని చట్టసభల్లో బలంగా వినిపించేందుకు ఓ రాజకీయ పార్టీని ప్రారంభించాలని సంకల్పించినట్లు విజయసాయి రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నానని చెప్పారు. రాజకీయ పార్టీ ఏర్పాటుకు ..మిగతా 2లో



రూ. 9,450 కోట్లతో

# రైల్వే ప్రాజెక్టులు

ఏపీ నాలుగు రాష్ట్రాలకు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు

కేంద్ర కేబినెట్ కమిటీ గ్రీన్ సిగ్నల్

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు ₹9,450 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు భారీ మల్టీ-ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు బుధవారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లోని ఎనిమిది జిల్లాల పరిధిలోని ప్రయాణికులకు, సరుకు రవాణా రంగానికి ఎంతో మేలు చేయనుంది. ఈ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే రైళ్ల రాకపోకల వేగం పెరగడమే కాకుండా, పట్టాలపై రద్దీ గణనీయంగా తగ్గుతుంది. 'పీఎం గతిశక్తి' ..మిగతా 2లో

# స్టైఫండ్ పెంపునకు ఓకే

ఇకపై ప్రతీ ఏటా సవరణ

జుడాలకు గుడ్ న్యూస్.. గత కొన్నాళ్లుగా స్ట్రైక్

2

# గ్రూప్ 1 పరీక్షల్లో అక్రమాలు

ఫ్లంబర్లు, ఎలక్ట్రిషియన్లతో దిద్దించారు

కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు.. సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు



(అమరావతి - జయజయహే)

పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీగా అక్రమాలు జరిగాయని సీఎం చంద్రబాబు నాయుడు ఆరోపించారు. ఏపీ శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 315 ప్రకారం ఏపీపీఎస్సీ ఏర్పడిందని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర సర్వీసుల్లోకి వచ్చే అధికారులను గ్రూప్-1 పరీక్షల ద్వారా ఎంపిక చేస్తారని, ఎంతో శ్రమించి అభ్యర్థులు ఉద్యోగాలు సాధిస్తారని చెప్పారు. అలాంటి పరీక్షల్లో గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ప్రజలు, ఉద్యోగార్థులు ఈ అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అసెంబ్లీ జవాబుదారీతనానికి వేదిక అని, ఇక్కడి నుంచే ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా ఏపీపీఎస్సీలో ..మిగతా 2లో

# రాజకీయాల్లోకి బొత్స అనూష

విజయనగరం జడ్పీ చైర్ పర్సన్‌గా పోటీ

తన రాజకీయ వారసురాలుగా ప్రకటన

వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ వెల్లడి

(అమరావతి - జయజయహే)



సీనియర్ నేతలు తాము రాజకీయాల్లో ఇన్ యాక్టివ్ అయ్యేలోపు వారసులను సిద్ధం చేస్తున్నారు. తాజాగా ఏపీ రాజకీయాల్లో కీలకనేత అయిన బొత్స సత్యనారాయణ తన రాజకీయ వారసురాల్ని ప్రకటించారు. ఆయన కుమారుడు డాక్టర్ లక్ష్మీనారాయణ్ సందీప్‌నకు రాజకీయాలపై ఆసక్తి లేకపోవడంతో కొన్ని రోజుల కిందట నుంచే కుమార్తె బొత్స అనూషను సిద్ధం చేస్తూ వచ్చారు. ఎంబీబీఎస్ చదివిన బొత్స అనూషకు రాజకీయాలపై ..మిగతా 2లో

# ప్రిన్సిపాల్‌ను చంపేసిన టెన్త్ స్టూడెంట్స్

**మొదటి పేజీ తరువాయి...**

కొలిక్కి తేవడంలో కీలక పాత్ర పోషించాయి. హత్యకు గురయ్యే ముందు ప్రిన్సిపాల్ రూపారెడ్డి మాట్లాడిన చివరి ఒకే ఒక్క పదం ఈ కేసు దర్యాప్తులో అతిపెద్ద మలుపుగా మారింది. ఫోన్ సంభాషణ ముగిసే సమయంలో ఆమె నోటి నుంచి వచ్చిన "బాబు" అనే మాటను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఆమె ఎవరిని ఉద్దేశించి ఆ మాట అన్నారనే కోణంలో విచారణ చేపట్టగా.... అనుమానం నేరుగా పాఠశాల విద్యార్థుల వైపు మళ్లింది. దీంతో దర్యాప్తు అధికారులు స్కూల్ విద్యార్థుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ కేసును ఛేదించడానికి ప్రత్యేక బృందాలు అహోరాత్రులు శ్రమించాయి. పోలీసులు దాదాపు 30 కిలోమీటర్ల పరిధిలోని 70కి పైగా సీసీటీవీ కెమెరాల్లోని దృశ్యాలను నిశితంగా పరిశీలించారు. అనుమానాస్పదంగా కనిపించిన 80 మందికి పైగా వ్యక్తులను సుదీర్ఘంగా విచారించారు. చివరకు సాంకేతిక ఆధారాలు, పక్కా సమాచారం సాయంతో నిందితులైన ఆ ఇద్దరు పదో తరగతి విద్యార్థులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ చేసిన నిందితుల వద్ద నుంచి రూ. 1.54 లక్షల నగదుతో పాటు రూపారెడ్డి ఐఫోన్, హత్యకు ఉపయోగించిన ఆయుధం, హ్యాండ్ గ్లౌజులు, మాస్కులు మరియు రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



**అసలేం జరిగిందంటే..?**

జిల్లా ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం... జల్సాలకు అలవాటుపడిన ఇద్దరు విద్యార్థులు ప్రిన్సిపల్ ఇంటికి చోరీకి వెళ్లారు. ఈ క్రమంలో గోడదూకి ఇంట్లో ప్రవేశించి చోరీకి పాల్పడిన విద్యార్థిని రూపారెడ్డి గుర్తించడంతో తన వెంట తీసుకెళ్లిన కత్తితో ఆమెను హత్య చేశాడు. స్కూల్ ఫీజుల వసూళ్లు జరుగుతుండటంతో ప్రిన్సిపల్ ఇంట్లో డబ్బు ఉంటుందని భావించి ఐదు రోజుల ముందు నుంచే చోరీకి ప్లాన్ చేశారు. "రూపారెడ్డి చివరిసారిగా ఆమె పిన్నితో మాట్లాడుతూ "బాబు" అనే పదం వాడారు. దీంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టాం. ఎవరితో ఆమె అలా మాట్లాడారనే విషయంపై ముందుకెళ్లాం. స్కూల్‌లో పిల్లలను కూడా అలా అంటారేమోనని అక్కడ విచారించాం. ప్రిన్సిపల్ హత్య తర్వాత నాలుగురోజులు ఆ స్కూల్‌కు సెలవులు ఇచ్చారు. రీఓపెన్ తర్వాత గైర్హాజరైన 13 మంది విద్యార్థుల గురించి ఆరా తీశాం. వారిలో ఐదుగురు పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. అందులో ఇద్దరు రెండు మూడు రోజుల నుంచి డబ్బు ఖర్చు చేస్తూ జల్సాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించాం. నగదు ఎక్కడిదని ప్రశ్నించగా తల్లిదండ్రులు ఇచ్చినట్లు చెప్పాడు. ఆ నోట్లపై రక్తపు మరకలు ఉన్నాయి. వాటి నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తే మనిషి రక్తంగా తేలింది" అని జిల్లా ఎస్పీ వివరించారు.

"అరెస్ట్ అయిన ఇద్దరు నిందితుల్లో ఒక విద్యార్థి గతంలో అదే స్కూల్ హాస్టల్‌లో ఉంటూ చదువుకునేవాడు. కొద్దిరోజుల క్రితం అతడి బ్యాగ్‌ను తనిఖీ చేయగా, అందులో కొంత డబ్బుతో పాటు ఒక సెల్‌ఫోన్ దొరికింది. దీంతో ప్రిన్సిపల్ రూపారెడ్డి, ఇతర టీచర్లు అతడిని తీవ్రంగా మందలించారు. అంతేకాకుండా తల్లిదండ్రులను స్కూలుకు పిలిపించి...... వారి ముందే హెచ్చరించి హాస్టల్ నుంచి తొలగించి డేస్కాలర్‌గా మార్చారు. అందరి ముందూ తమను మందలించారనే అవమానంతో సదరు విద్యార్థి ప్రిన్సిపాల్ రూపారెడ్డిపై తీవ్రమైన కక్ష పెంచుకున్నాడు. మరోవైపు ఈ మైనర్ నిందితుడికి మద్యం తాగే అలవాటుతో పాటు బైక్‌లపై తిరగడం అంటే తీవ్రమైన మోజు ఉండేది. ఇటీవల ఒకసారి గోవా టూర్‌కు కూడా వెళ్లొచ్చినట్లు దర్యాప్తులో తేలింది. ఎలాగైనా పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించి జాలీగా గడపాలనే ఆలోచనతో, ప్రిన్సిపాల్ రూపారెడ్డి ఇంట్లో చోరీ చేయాలని పథకం వేశాడు. ఇందుకోసం మరొక మైనర్ స్నేహితుడిని కూడా తనతో పాటు కలుపుకున్నాడు" అని ఎస్పీ తెలిపారు. పథకం ప్రకారం ఈ నెల 11వ తేదీన ప్రిన్సిపాల్ స్కూల్ నుంచి ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత, నిందితులు ఇద్దరూ కలిసి ఆమె ఇంటికి చేరుకున్నారు. అందులో ఒక విద్యార్థి ముఖానికి మాస్క్ ధరించి కాంపౌండ్ గోడ దూకి లోపలికి ప్రవేశించాడు. అయితే అనుకోకుండా అతడి ముఖానికి ఉన్న మాస్క్ ఊడిపోవడంతో.... ప్రిన్సిపాల్ రూపారెడ్డి అతడిని వెంటనే గుర్తుపట్టారు. తాను దొరికిపోయాననే భయంతో సదరు విద్యార్థి దారుణానికి ఒడిగట్టాడు. వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఏకంగా 27 సార్లు కత్తితో పొడిచి అత్యంత కిరాతకంగా ఆమెను హత్య చేశాడు" అని జిల్లా ఎస్పీ వివరించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన ఐదు ప్రత్యేక దర్యాప్తు బృందాల పనితీరును నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేకంగా అభినందించారు. కేసు విచారణలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి పురస్కారాలు అందజేస్తామని ఆయన ప్రకటించారు.

## రూ. 9,450 కోట్లతో
# రైల్వే ప్రాజెక్టులు

**మొదటి పేజీ తరువాయి...**

జాతీయ మాస్టర్ ప్లాన్ ప్రాతిపదికన రూపొందించిన ఈ పథకాల ద్వారా దాదాపు 6,448 గ్రామాలకు, సుమారు 60 లక్షల మంది జనాభాకు నేరుగా మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఇది ప్రాంతీయంగా స్వయం సమృద్ధిని సాధించడమే కాక, కొత్త ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను విరివిగా సృష్టిస్తుందని కేంద్రం స్పష్టం చేసింది.

**పర్యాటక రంగానికి బూస్ట్.. పర్యావరణానికి రక్షణ**

ఈ కొత్త లైన్లు అందుబాటులోకి వస్తే నేలపట్టు పక్షుల కేంద్రం, పులికాట్ సరస్సు, భితర్కనిక నేషనల్ పార్క్, కుల్దిహా వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, చండీపూర్ బీచ్, లలితగిరి బౌద్ధ క్షేత్రం, లార్డ్ వీరరాఘవ పెరుమాళ్ కోవెల, దబలేశ్వర్ ఆలయం వంటి ప్రసిద్ధ పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలకు ప్రయాణం మరింత సులభతరం కానుంది. దీంతో పాటు బొగ్గు, ఇనుప ఖనిజం, సిమెంట్, ఉక్కు, ఆటోమొబైల్, ధాన్యాల రవాణా వేగవంతమై, ప్రతి ఏటా అదనంగా 76 మిలియన్ టన్నుల సరుకు రవాణా సాధ్యమవుతుంది. రైలు రవాణా పెరగడం వల్ల సుమారు 13 కోట్ల లీటర్ల చమురు దిగుమతులు తగ్గడమే కాకుండా, 65 కోట్ల కిలోల కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయి. ఇది 2.60 కోట్ల చెట్లను నాటడంతో సమానమని కేంద్రం తన ప్రకటనలో వివరించింది.

**నాలుగు కీలక రైల్వే లైన్లు ఇవే..**

ఖరగ్‌పూర్ - భద్రక్ (రాణితాల్) 4వ లైన్: 173 కిలోమీటర్లు
గుమ్మిడిపూడి - గూడూరు 3వ, 4వ లైన్: 90 కిలోమీటర్లు (ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సరిహద్దు ప్రాంతాలకు అత్యంత కీలకం)
భద్రక్ - హరిదాస్‌పూర్ 4వ లైన్: 75 కిలోమీటర్లు
కటక్ - పారాదీప్ (బడబంధ) 3వ, 4వ లైన్: 72 కిలోమీటర్లు
60 లక్షల మంది ప్రజలకు నేరుగా ప్రయోజనం

# రాజకీయ పార్టీని స్థాపిస్తున్నా..

**మొదటి పేజీ తరువాయి...**

సంబంధించి త్వరలోనే కీలక ప్రకటన చేయనున్నట్లు విజయసాయి రెడ్డి వెల్లడించారు. విజయవాడ వేదికగా ఈ నెలలోనే తన రాజకీయ ప్రణాళికను ప్రకటిస్తానని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాజకీయ కార్యాచరణను రూపొందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు, దాని లక్ష్యాలు, భవిష్యత్తు కార్యాచరణపై విజయవాడలో స్పష్టత ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రం, దేశంలో కరువు పరిస్థితులు లేకుండా సమృద్ధిగా వర్షాలు కురవాలని శ్రీవారిని ప్రార్థించినట్లు విజయసాయి రెడ్డి చెప్పారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని శ్రీవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. విజయసాయి రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఆయన ప్రకటించబోయే రాజకీయ ప్రణాళికపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. విజయవాడలో జరిగే ప్రకటనలో పార్టీ పేరు, విధివిధానాలు, రాజకీయ లక్ష్యాలు, భవిష్యత్తు కార్యాచరణపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# రాజకీయాల్లోకి బొత్స అనూష

**మొదటి పేజీ తరువాయి...**

ఆసక్తిని గమనించిన తండ్రి బొత్స ఆ దిశగానే ప్రోత్సహించారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మీడియాతో చిట్ చాట్‌లో మాట్లాడుతూ డాక్టర్ బొత్స అనూషను తన రాజకీయ వారసురాలిగా ప్రకటించారు. త్వరలో జరగనున్న జిల్లా పరిషత్ ఎన్నికల్లో బరిలోకి ఆమె దిగుతారని, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ రేసులో బరిలో ఉంటారని సైతం వెల్లడించారు. సాధారణంగా కుమారులు ఉంటే వారు యాక్టివ్‌గా రాజకీయాల్లోకి వస్తుంటారు. అయితే బొత్స సత్యనారాయణ ఇంట్లోనూ అదే జరుగుతుందని అంతా భావించారు. కానీ లక్ష్మీనారాయణ్ సందీప్‌నకు పాలిటిక్స్‌పై ఆసక్తి లేకపోవడంతో డాక్టర్‌గా ప్రాక్టీస్ చేస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారు. అనూహ్యంగా ఆయన కుమార్తె బొత్స అనూష పేరు కొన్ని రోజుల కిందట తెరపైకి వచ్చింది. కొన్ని నెలల కిందట నుంచే ఆమె తండ్రి బొత్సతో కలిసి పలు రాజకీయ సమావేశాలకు, కీలక భేటీలకు హాజరవుతున్నారని తెలిసిందే.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, ప్రస్తుత నవ్యాంధ్రప్రదేశ్‌లోనూ అత్యంత సీనియర్ రాజకీయ నేతల్లో ఒకరిగా బొత్స సత్యనారాయణ ముద్ర వేసుకున్నారు. 5 సార్లు మంత్రిగా సేవలు అందించిన ఆయన, బొబ్బిలి ఎంపీగా, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్‌గా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఉత్తరాంధ్ర రాజకీయాలను ప్రభావితం చేసిన నేతల్లో బొత్స ఒకరు. ప్రస్తుతం ఆయన శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా కొనసాగుతున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ హవా అంతగా లేదు. అయితే విజయనగరం జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో బొత్స కుటుంబానికి ఇప్పటికీ బలమైన పట్టు ఉంది. ఆయన భార్య బొత్స ఝాన్సీ రెండుసార్లు ఎంపీగా గెలిచారు. దాంతో తల్లిదండ్రుల వారసత్వం అందిపుచ్చుకుని బొత్స అనూష తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు ఇదే కుటుంబంలో బొత్స సోదరుడు అప్పలనర్సయ్య ఎమ్మెల్యేగా గెలిచారు.

# మున్సిపల్ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్

**ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలంటూ ప్రభుత్వ జీఓ జారీ**

**బీసీలకు కొత్త రిజర్వేషన్లు అమలు**

**2025 ఓటర్ల జాబితాతో ఎన్నికలకు**

**నెలాఖరులోగా పోలింగ్ కేంద్రాల ప్రక్రియ పూర్తి**

**(అమరావతి - జయజయహే)**

మున్సిపల్ ఎన్నికలకు ప్రభుత్వం బుధవారం నాడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలంటూ జీవో జారీ చేసింది. దాంతో ఏపీలో 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. 87 మునిసిపాలిటీ పాలక వర్గాల గడువు ఇప్పటికే పూర్తయింది. మరో 13 పాలకవర్గాల గడువు నవంబర్‌తో ముగియనుందని అధికారులు తెలిపారు. కోర్టు కేసుల కారణంగా రాష్ట్రంలోని మరో 23 మున్సిపాలిటీలో ఎన్నికలు వాయిదా వేశారు. అర్బన్ మున్సిపాలిటీలు, పట్టణాల్లో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్‌తోనే ఎన్నికలు నిర్వహించనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఇటీవల ఆమోదించిన బీసీ రిసర్వేషన్‌లు అమలు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రత్యేక సమగ్ర సవరణ తుది జాబితాలతో కాకుండా 2025 నాటి ఓటర్ల జాబితాల ఆధారంగానే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. అక్టోబరు 3న ూ×= తుది జాబితాలు విడుదలయ్యే వరకు వేచి చూస్తే ఎన్నికల నిర్వహణలో తీవ్ర జాప్యం జరుగుతుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరులోనే ఎన్నికలు నిర్వహించాలని భావిస్తుండటంతో, ఓటర్ల జాబితాల రూపకల్పనకు ూజుజ నోటిఫికేషన్ (నెం.401/ూజుజ-ఖీ1/2026-1) జారీ చేసింది. మున్సిపాలిటీల్లో సెప్టెంబర్ 3 నాటికి, పంచాయతీల్లో ఆగస్టు 17 నాటికి ఓటర్ల జాబితాల ప్రచురణ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల ప్రక్రియను ఆగస్టు 21 నుంచి 31 వరకు పూర్తి చేయనున్నారు. అదనపు బ్యాలెట్ బాక్సుల సేకరణతో పాటు 45 రోజుల్లోగా సిబ్బంది శిక్షణ ప్రక్రియను పూర్తి చేసేలా ఈసీ ఏర్పాట్లు ముమ్మరం చేస్తోంది.

# స్టైఫండ్ పెంపునకు ఓకే

**ఇకపై ప్రతీ ఏటా సవరణ**

**జుడాలకు గుడ్ న్యూస్... గత కొన్నాళ్లుగా స్ట్రైక్**

**(అమరావతి - జయజయహే)**




రాష్ట్రంలోని జూనియర్ డాక్టర్లకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. జూనియర్ డాక్టర్ల స్టైపండును ఇకపై ప్రతి ఏడాది సవరించే విధానాన్ని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో భాగంగా ఇంటర్న్‌షిప్ చేసేవారికి ఈ ఏడాది జనవరి 1 నుంచి 5 శాతం పెంపు ఇవ్వడంతోపాటు తర్వాత ప్రతి ఏడాది 3 శాతం చొప్పున పెంచాలని ప్రతిపాదించింది. పీజీ, సూపర్ స్పెషాలిటీ పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులకు ప్రస్తుతం చెల్లిస్తున్న స్టైపండ్ ప్రతి ఏడాది 3 శాతం చొప్పున పెంపు ఇవ్వాలని పేర్కొంది. ప్రస్తుతం రెండేళ్లకు ఒకసారి సవరణ చేస్తున్న విధానానికి బదులుగా, ఏటా క్రమబద్ధమైన, మెరుగైన విధానాన్ని ప్రతిపాదించింది. భవిష్యత్తులో స్టైపండ్ రేట్ల సవరణకు స్పష్టమైన శాశ్వత విధానం ఉంటుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్ తెలిపారు. ఇంటర్న్లు, పీజీ, సూపర్ స్పెషాలిటీ వైద్య విద్యార్థులకు ప్రస్తుతం చెల్లిస్తున్న స్టైపెండ్‌ను 15 శాతం పెంచాలని ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో 2021 నుంచి ప్రతి ఏడాది ఆటోమేటిగ్గా 3శాతం స్టైపండ్ పెంచుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ పీజీలకు 3 శాతం, ఇంటర్న్లకు 5శాతం చొప్పున ఈ ఏడాది పెంచాలని భావిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆటోమేటిక్‌గా 3 శాతం చొప్పున స్టైపండ్ పెంచాలని నిర్ణయించినట్లు వీరపాండియన్ తెలిపారు. ఎన్నికల హామీ మేరకు స్టైపండ్ పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జూనియర్ వైద్యులు ఆందోళన బాట పట్టిన విషయం తెలిసిందే. స్టైపండ్ పెంచాలని డిమాండ్ చేస్తూ జూనియర్ డాక్టర్లు చేస్తున్న ఆందోళన ఎనిమిదో రోజుకు చేరింది. ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీ జూడా) ఆధ్వర్యంలో ఈనెల 11న తొలిదశ, 12 నుంచి రెండోదశ ఆందోళనలు కొనసాగాయి. అత్యవసర సేవలు మాత్రమే అందిస్తూ 16వ తేదీ వరకు నిరసనలు తెలిపారు. 15% స్టైపండ్ పెంచాలన్న జూడాల డిమాండ్‌కు ప్రభుత్వం తలొగ్గకపోవడంతో ఈనెల 17 నుంచి మూడో దశ ఆందోళనలో భాగంగా అత్యవసరంతోపాటు అన్ని సేవలూ నిలిపివేసి సమ్మెను తీవ్రతరం చేశారు. రోగులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం సెకండరీ, పబ్లిక్ హెల్త్ పరిధి ఆసుపత్రుల్లోని వైద్యులను ప్రత్యామ్నాయంగా అందుబాటులోకి తెచ్చింది. బోధనాసుపత్రుల్లో రోజువారీ ఓపీ, ఐపీ, శస్త్రచికిత్సలు, డయాలసిస్, ట్రామా సేవలకు ఇబ్బంది కలగకుండా పర్యవేక్షిస్తోంది. జూడాలతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పలు దఫాలుగా చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో సమ్మె కొనసాగింది.

# కరవు కష్టాలు..!?

**మొదటి పేజీ తరువాయి...**

పేర్కొంది. అంటే ఏడాది వ్యవధిలో ఆహార ధరల ఒత్తిడి గణనీయంగా పెరిగే ప్రమాదం ఉంది. ఈ హెచ్చరిక భారత్‌కు మరింత ప్రాధాన్యమైంది. ఇప్పటికే దేశంలో ఎరువుల ధరలు, సరఫరా అంశాలు రైతులకు సవాలుగా మారుతున్నాయి. మరోవైపు భారత వ్యవసాయం ఇప్పటికీ ప్రధానంగా రుతుపవనాలపై ఆధారపడి ఉంది. ఒకవైపు సాగు వ్యయాలు పెరిగి, మరోవైపు వర్షపాతం అనిశ్చితంగా మారితే రైతులపై ఆర్థిక భారం పెరగడంతో పాటు పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. దాని ప్రభావం చివరకు వినియోగదారులపై కూడా పడవచ్చు.

**ఎరువుల కొరతే ప్రధాన సమస్య**

జేపీ మోర్గాన్ ప్రకారం.. ప్రపంచ యూరియా ఎగుమతుల్లో దాదాపు 42 శాతం, అమ్మోనియా ఎగుమతుల్లో 27 శాతం మధ్యప్రాచ్య దేశాల నుంచే జరుగుతున్నాయి. కాబట్టి హార్ముజ్ జలసంధి చుట్టూ ఉద్రిక్తతలు లేదా రవాణా అంతరాయాలు ఎక్కువకాలం కొనసాగితే ప్రపంచవ్యాప్తంగా ఎరువుల సరఫరా, ధరలపై ప్రభావం పడే అవకాశం ఉంది. అంతేకాదు, నైట్రోజన్ ఆధారిత ఎరువుల తయారీలో సహజ వాయువు కీలక ముడిసరుకు. గ్యాస్ ధరలు పెరిగితే యూరియా వంటి ఎరువుల ఉత్పత్తి వ్యయం కూడా పెరుగుతుంది. ఎరువులు ఖరీదైన కారణంగా రైతులు వాటి వినియోగాన్ని తగ్గిస్తే పంట దిగుబడులపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. దెబ్బతిన్న ఎరువుల తయారీ సామర్థ్యాన్ని పూర్తిగా పునరుద్ధరించడానికి ఒకటి నుంచి నాలుగు సంవత్సరాలు పట్టవచ్చని జేపీ మోర్గాన్ అంచనా వేసింది. కొన్ని సహజ వాయువు ఆధారిత ప్లాంట్లు సాధారణ స్థితికి రావడానికి మూడు నుంచి ఐదు సంవత్సరాలు పట్టే అవకాశం ఉందని పేర్కొంది.

భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద యూరియా కొనుగోలుదారుల్లో ఒకటి. దేశంలో రైతులకు 45 కిలోల యూరియా బస్తా సుమారు రూ.266.50కే లభిస్తోంది. అయితే అంతర్జాతీయ మార్కెట్ ధరతో పోలిస్తే ఇది చాలా తక్కువ. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా ఈ వ్యత్యాసాన్ని భరిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ ఎరువుల సబ్సిడీ బిల్లు 31 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.3 లక్షల కోట్లు దాటే అవకాశం ఉందని నివేదికలో పేర్కొన్న ప్రభుత్వ అధికారి వెల్లడించారు. మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు కొనసాగితే ఈ వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వానికి మరో క్లిష్టమైన పరిస్థితి ఎదురుకావచ్చు. ఎరువులను తక్కువ ధరకు అందిస్తూ పెరుగుతున్న సబ్సిడీ భారాన్ని భరించాలా? లేక రైతులు ఎరువుల వినియోగాన్ని తగ్గించేలా చేయాలా? అనే ప్రశ్న తలెత్తుతోంది.

**మరోవైపు ఎల్ నినో ముప్పు**

ఎరువుల సమస్యకు తోడు వాతావరణ పరిస్థితులు కూడా ఆహార సరఫరాపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అభివృద్ధి చెందుతున్న ఎల్ నినో పరిస్థితి అసాధారణంగా బలమైన స్థాయికి చేరే అవకాశం ఉందని జేపీ మోర్గాన్ హెచ్చరించింది. 2026 చివరి నాటికి అత్యంత బలమైన లేదా 'సూపర్ ఎల్ నినో' ఏర్పడే అవకాశం 81 శాతంగా ఉందని సంస్థ ఆర్థికవేత్తలు అంచనా వేశారు. అలాగే ఎల్ నినో పరిస్థితులు 2027లో కూడా కొనసాగేందుకు 97 శాతం అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎల్ నినో కారణంగా ప్రపంచంలోని అనేక వ్యవసాయ ప్రాంతాల్లో వర్షపాతం, ఉష్ణోగ్రతల తీరులో మార్పులు వస్తాయి. గతంలో ఎల్ నినో పరిస్థితులతో ఉష్ణమండల ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తి సగటున 3.5 శాతం తగ్గిన సందర్భాలు ఉన్నాయని జేపీ మోర్గాన్ తెలిపింది. ఎల్ నినో ప్రభావం భారత నైరుతి రుతుపవనాలపై పడే అవకాశం ఉండటంతో వ్యవసాయ రంగంలో ఆందోళన పెరుగుతోంది. అయితే ఎల్ నినో ఉన్న ప్రతిసారీ భారత్‌లో కరువు వస్తుందని చెప్పలేం. ఉదాహరణకు 1997లో బలమైన ఎల్ నినో ఉన్నప్పటికీ భారత్‌లో సాధారణం కంటే 2 శాతం అధిక వర్షపాతం నమోదైంది. భారత మహాసముద్ర ద్విధ్రువం వంటి ఇతర వాతావరణ అంశాలు కూడా రుతుపవనాలపై ప్రభావం చూపుతాయి. అయితే బలమైన ఎల్ నినో వర్షపాతం లోపించే ప్రమాదాన్ని మాత్రం పెంచుతుంది. వర్షాలు సాధారణ స్థాయిలో ఉన్నప్పటికీ అవి సరైన సమయంలో కురవకపోతే పంటలకు నష్టం కలగవచ్చు. ఎక్కువకాలం వర్షాలు లేకపోవడం, ఆ తర్వాత ఒక్కసారిగా భారీ వర్షాలు కురవడం వంటి పరిస్థితులు కూడా పంట దిగుబడులను దెబ్బతీయవచ్చు.

**బియ్యం నుంచి పప్పులు, పత్తి వరకు ప్రభావం**

రుతుపవనాలు బలహీనంగా లేదా అనిశ్చితంగా ఉంటే బియ్యం, పప్పుధాన్యాలు, నూనెగింజలు, పత్తి, చెరకు వంటి కీలక పంటలపై ప్రభావం పడే అవకాశం ఉంది. పంట ఉత్పత్తి తగ్గితే దేశీయ మార్కెట్లో సరఫరా తగ్గుతుంది. దీంతో హోల్‌సేల్ ధరలు పెరిగి, క్రమంగా రిటైల్ మార్కెట్‌లో ఆహార ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉంది. 2023-24లో ఎల్ నినో పరిస్థితుల సమయంలో దేశీయ సరఫరాను కాపాడేందుకు, ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం పలు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే.

**భారత్‌లో ఆహార కొరత వస్తుందా?**

జేపీ మోర్గాన్ హెచ్చరికను భారత్‌లో ఆహారం పూర్తిగా కొరత ఏర్పడుతుందనే అర్థంలో చూడకూడదు. సంస్థ ప్రధానంగా ఆహార ధరలు పెరగడం, సరఫరాపై ఒత్తిడి పెరగడం గురించి హెచ్చరిస్తోంది. భారత్‌కు కొన్ని రక్షణాత్మక అంశాలు కూడా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ధాన్య నిల్వలు తగిన స్థాయిలో ఉండటం, ఆసియాలో బియ్యం నిల్వలు సాపేక్షంగా మెరుగ్గా ఉండటం కొంత ఊరటనిచ్చే అంశాలు. భారత్‌లో కూడా బియ్యం నిల్వలు బలంగా ఉన్నట్లు జేపీ మోర్గాన్ పేర్కొంది. అయితే నిల్వలు కొంతకాలం వరకు మాత్రమే సరఫరా షాక్‌ను ఎదుర్కోవడంలో సహాయపడతాయి. ఎరువుల ధరలు అధికంగా ఉండటం, పంట దిగుబడులు తగ్గడం, అంతర్జాతీయ సరఫరా అంతరాయాలు దీర్ఘకాలం కొనసాగితే పరిస్థితి క్లిష్టంగా మారే అవకాశం ఉంది.

# గ్రూప్ 1 పరీక్షల్లో అక్రమాలు

**మొదటి పేజీ తరువాయి...**

కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తామని తెలిపారు. 2019-24 మధ్య రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని తాను చాలాసార్లు చెప్పానని చంద్రబాబు అన్నారు. ప్రభుత్వంలోని వివిధ వ్యవస్థలపై ప్రజల్లో విశ్వాసం పోయేలా గత పాలకులు వ్యవహరించారని విమర్శించారు. 2018లో గ్రూప్-1 సర్వీసులకు నోటిఫికేషన్ విడుదల చేయగా 1.14 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని చంద్రబాబు తెలిపారు. వారిలో 325 మందిని షార్ట్‌లిస్ట్ చేశారని చెప్పారు. పదో తరగతి పరీక్షల జవాబు పత్రాలను అత్యంత భద్రత మధ్య పోలీసు ఎస్కార్ట్‌తో తరలిస్తామని, అలాంటిది రాష్ట్రాన్ని పాలించే అధికారులను ఎంపిక చేసే పరీక్షల విషయంలో మరింత భద్రత ఉండాలని అన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో నిబంధనలను పట్టించుకోకుండా వ్యవహరించారని ఆరోపించారు. గ్రూప్-1 పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో డిజిటల్ విధానాన్ని పక్కనపెట్టి మాన్యువల్ మూల్యాంకనం చేయాలని హైకోర్టు ఆదేశించినట్లు చంద్రబాబు తెలిపారు. అయినప్పటికీ కోర్టును తప్పుదోవ పట్టించేలా అఫిడవిట్లు దాఖలు చేసి వ్యవహరించారని ఆరోపించారు. కోర్టు ఉత్తర్వుల తర్వాత పరిస్థితిని సరిదిద్దుకోవాల్సి ఉండగా, హాయ్‌లాండ్‌లో మూల్యాంకనం కోసం రూ.1.19 కోట్ల పనులకు ఉత్తర్వులు ఇచ్చారని చంద్రబాబు పేర్కొన్నారు. మరోవైపు కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ నియామకాలు కూడా చేశారన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనలను పక్కనపెట్టి ప్రైవేటు వ్యక్తులకు మూల్యాంకన బాధ్యతలు అప్పగించారని సీఎం విమర్శించారు. గ్రూప్-1 అభ్యర్థులు రాసిన పరీక్ష పత్రాలను ఎలక్ట్రిషియన్లు, డ్రైవర్లు, ప్లంబర్లు, సెక్యూరిటీ గార్డులతో మూల్యాంకనం చేయించారని సీఎం చంద్రబాబు ఆరోపించారు.

# డేటా సెంటర్లపై అపోహలు వద్దు

మొదటి పేజీ తరువాయి...

చూశాను. అక్కడ వాటర్ కూల్ టెక్నాలజీ లేదు, అంతా ఎయిర్ కూల్ టెక్నాలజీ వాడుతున్నారు. ఇంకా కొత్త టెక్నాలజీలు వస్తున్నాయి. నీటి వినియోగం మరింత తగ్గించుకుంటూ వస్తున్నారు. ఎనర్జీ అవసరాలు కూడా తగ్గించే టెక్నాలజీ రాబోతోంది. పోలవరం నుంచి వస్తున్న నీరు ప్రత్యేకంగా విశాఖపట్నం నగర ప్రజల తాగు, సాగు, పరిశ్రమల అవసరాలకు కేటాయింపులు జరిగాయి. పరిశ్రమలకు కేటాయించిన నీటి వాటా నుంచే డేటా సెంటర్లకు అవసరమైన నీరందిస్తాం. రాబోయే 18నెలల్లో పోలవరం నుంచి గ్రావిటీ ద్వారా విశాఖ ప్రజలకు తాగునీరు అందిస్తాం. డేటా సెంటర్లకు డెడికేటెడ్ పైప్ లైన్ ద్వారా నీరు అందిస్తాం తప్ప సిటీ ఇన్ ఫ్రా నుంచి మళ్లించేది లేదు.

**థర్మల్ ప్లాంటులపై మాట్లాడరెందుకు?**

1 గిగావాట్ థర్మల్ పవర్ ప్రాజెక్టు డేటా సెంటర్ ఉపయోగించే నీటి కంటే పదిరెట్లు ఎక్కువగా వినియోగిస్తుంది. విశాఖలో ఇప్పుడు డేటా సెంటర్లపై ధర్నా చేస్తున్న వారు ఏనాడు థర్మల్ ప్లాంట్ గురించి మాట్లాడలేదు. ఎనర్జీ కావాలి, డేటా సెంటర్ వద్దనడం ఎలా సబబు? ఈరోజు ఉన్న పరిస్థితుల్లో ఎఐ అనివార్యం. అది మన జీవితం భాగమైంది. గూగుల్ పెద్దఎత్తున పెట్టుబడి పెట్టడానికి ముందుకు రావడం వల్లే మిగిలిన గ్లోబల్ సంస్థలు విశాఖలో తమ డేటా సెంటర్లకు భూములు కేటాయించాలని అడుగుతున్నాయి.

**వన్ నేషన్- వన్ గ్రిడ్‌తో ఎంతో మేలు**

విద్యుత్ కు సంబంధించి వెస్టర్న్ గ్రిడ్ కు, ఇండియన్ గ్రిడ్ కు చాలా తేడా ఉంది. మన వద్ద వన్ నేషన్ -- వన్ గ్రిడ్ వ్యవస్థను నరేంద్రమోదీ నాయకత్వంలో తెచ్చారు. దీనివల్ల రాయలసీమలో తయారుచేసే రెన్యువబుల్ ఎనర్జీ నార్త్ ఇండియాకు కూడా పంపించే అవకాశం ఉంది. డేటా సెంటర్లు



కనీసం 70శాతం గ్రీన్ ఎనర్జీ వాడాలని స్పష్టంగా చెప్పాం. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ నే వాడాలని వారికి చెప్పాం. భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా మంత్రి గొట్టిపాటి నాయకత్వంలో డిస్ట్రిబ్యూషన్ లైసెన్సు కూడా ఇచ్చాం. విద్యుత్ ఛార్జీల విషయంలో ఎలాంటి పెంపుదల ఉండదు. విద్యుత్ ఛార్జీలు ఎట్టి పరిస్థితుల్లో పెంచేది లేదని ముఖ్యమంత్రి పదేపదే చెబుతున్నారు. పెంచకపోగా ఈ ఏడాది 13పైసలు విద్యుత్ చార్జీలు తగ్గించిన ఘనత ఎన్డీఏప్రభుత్వానిది. ప్రత్యేకించి ఒక సంస్థ 100 ఎంఎల్ డి డిశాలినేషన్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేస్తోంది. దానికి కూడా ప్రభుత్వం కట్టుబడి ఉంది.

**విశాఖపట్నం..ఇక ఏఐ పట్నం**


అశ్వనీ వైష్ణవ్ గూగుల్ శంకుస్థాపనకు వచ్చినపుడు ఇక విశాఖపట్నం కాదు... ఎఐ పట్నంగా మారబోతోంది అని చెప్పారు. విశాఖ గేట్ వే ఆఫ్ ఇండియా ఎఐ ఎకో సిస్టమ్ మార్చడం మా కమిట్మెంట్. దీంతోపాటు రియల్ ఎస్టేట్ వారు జిసిసిలు, ఐటి సెజ్ లు ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తున్నారు. మరో ముఖ్యమైన విషయం ఒక అమెరికన్ యూనివర్సిటీ ఎఐ రిలేటెడ్ సబ్జెక్ట్ తో విశాఖ కేంద్రంగా ఏర్పాటుచేయబోతున్నారు. ఆ పేరు ఇప్పుడు చెప్పడం ఒప్పందం ప్రకారం కుదరదు కనుక చెప్పడంలేదు.

**కావాలనే అపోహలు సృష్టిస్తున్నారు**


కావాలని కొందరు రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. ఎక్కడా పర్యావరణ ఉల్లంఘనలు చేయడం లేదు. కొంతమంది కావాలని దొంగ వీడియోలు తీసుకొచ్చి ఏదో అయిపోతుందని చెప్పే మాటలను పట్టించుకోవద్దు. స్టాన్ఫోర్డ్ వర్సిటీ సమీపంలో పోలో వోల్టో డేటా సెంటర్ స్వయంగా చూశాను. కనీసం అక్కడ ఉన్నట్లు కూడా మాకు తెలియలేదు. దయచేసి విశాఖప్రజలు దుష్ప్రచారం నమ్మవద్దు, మేం పట్టుదల, కమిట్ మెంట్ తో పనిచేస్తున్నాం. మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో డేటా సెంటర్ మన గడ్డపై ఉండాల్సిన అవసరం చాలా ఉంది. కొత్తగా ఎఐ స్మార్ట్ ఫోన్లు, డివైజ్ లు వస్తున్నాయి. ఆ డేటా అంతా ఎఐ డేటా సెంటర్ లో స్టోర్ అవుతుంది. ఐదేళ్లలో ఆపరేటింగ్ సిస్టమ్స్ కూడా మారబోతున్నాయి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కష్టపడి పెట్టుబడులు తీసుకువస్తున్నాం. అపోహలు అస్సలు నమ్మొద్దు. ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ లో రెన్యువబుల్ ఎనర్జీ వాడి గ్రీన్ స్టీల్ తయారు చేస్తున్నారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుచేసేపుడు భూమిని చదును చేయాలి. దానిని ప్రకృతి విధ్వంసం అనడం ఎంతవరకు న్యాయమో ప్రజలు ఆలోచించాలి. అభివృద్ధి జరిగే సమయంలో ప్రకృతిపై కొంత భారం ఉంటుంది. దానిని కనీస స్థాయిలో తగ్గించేందుకు ఒక కార్యాచరణ పెట్టుకొని మేం పనిచేస్తున్నాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. 2019 ఎదురుగాలిలోనూ విశాఖప్రజలు మమ్మల్ని ఆశీర్వదించారు. విశాఖపట్నంపై మాకు కమిట్మెంట్ ఉంది. నూరుశాతం సస్టయినబుల్ మెకానిజంతో డేటా సెంటర్స్, ఐటి ఎకో సిస్టమ్, అనకాపల్లిలో ఫార్మా మ్యానుఫ్యాక్చరింగ్, స్టీల్ ఎకో సిస్టమ్ వస్తున్నాయి. వీటిని ముందుకు తీసుకెళ్లే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి లోకేష్ చెప్పారు

## సీఎం తో నియోజకవర్గం అభివృద్ధి పై చర్చించిన ఎమ్మెల్యే అధిములం

**సత్యవేదు, ఆగస్టు 19,జయ జయహే.**



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో సత్యవేదు నియోజకవర్గ ఎమ్మెల్యే ఆదిమూలం సమావేశమయ్యారు. మంగళవారం అసెంబ్లీలో ప్రస్తావించిన నియోజకవర్గ సమస్యలనుబుధవారం ముఖ్యమంత్రి దృష్టికి ఎమ్మెల్యే అధిములం తీసుకెళ్లారు. ప్రధానంగా దాసుకుప్పం బైపాస్ రోడ్డు, సత్యవేదు ప్రభుత్వ ఆసుపత్రిని ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాడం,తాత్కాలిక భవనాల్లో కొనసాగుతున్న డిగ్రీ కళాశాల పరిస్థితిని కూడా ఎమ్మెల్యే వివరించారు. ప్రస్తుతం ఉన్న భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్న నేపథ్యంలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని డిగ్రీ కళాశాలకు నూతన భవనం నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు.మూడు, నాలుగు మండలాలకు కేంద్రంగా ఎల్లప్పుడూ రద్దీగా ఉండే పిచ్చాటూరు మండల కేంద్రంలో అన్నా క్యాంటీన్ నిర్మాణం అవసరాన్ని కూడా ఎమ్మెల్యే వివరించారు. నియోజకవర్గంలోని అతి పెద్ద మండలమైన కేవీబీపురం మండలంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కళ్యాణ మండపం నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకతను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఎమ్మెల్యే ఆదిమూలం ప్రస్తావించిన సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



## టీటీడీకి రూ.15 లక్షలు విరాళం

**తిరుమల,ఆగస్ట్ 19, జయ జయహే**

హైదరాబాద్ కు చెందిన డాక్టర్ పి.శిల్పా, డాక్టర్ శ్రీధర్ రెడ్డి దంపతులు టీటీడీ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు బుధవారం రూ.15 లక్షలు విరాళంగా అందించారు. దాతలు తిరుమలలోని అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం చెక్కును అందజేశారు.

# విశాఖ వేదికగా బ్రిక్స్ దేశాల కీలక సమావేశాలు

### 22, 23 తేదీల్లో యువజన, క్రీడా మంత్రుల సమావేశాలు

### 11 బ్రిక్స్ దేశాల నుంచి మంత్రులు, ఉన్నతాధికారుల రాక

### భాగస్వామ్యం కానున్న సీఎం నారా చంద్రబాబు నాయుడు

**విశాఖపట్నం, ఆగస్టు 19, జయ జయహే**

అంతర్జాతీయ స్థాయిలో మరో ప్రతిష్టాత్మక కార్యక్రమానికి విశాఖ వేదిక కానుంది. భారతదేశం 2026 బ్రిక్స్ అధ్యక్షతలో భాగంగా ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖపట్నంలో 2వ బ్రిక్స్ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రుల సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రపంచంలోని ప్రముఖ అభివృద్ధి చెందుతున్న దేశాల కూటమి అయిన బ్రిక్స్‌కు చెందిన 11 దేశాల నుంచి మంత్రులు, ఉన్నతస్థాయి ప్రతినిధులు విశాఖకు రానుండటంతో నగరం అంతర్జాతీయ అతిథ్యానికి సిద్ధమవుతోంది. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల ప్రతినిధుల భాగస్వామ్యంతో జరిగే ఈ సమావేశాలు యువత, క్రీడలు, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ సహకారంపై కీలక చర్చలకు వేదిక కానున్నాయి. ఈ సమావేశాల్లో యువతకు విద్య, నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహికత, ఆవిష్కరణలు, సాధికారతతో పాటు క్రీడా అభివృద్ధి, క్రీడా సాంకేతికత, క్రీడా పరిశ్రమ, సామర్థ్య నిర్మాణం, సంప్రదాయ, స్వదేశీ క్రీడల పరిరక్షణ తదితర అంశాలపై సభ్య దేశాలు చర్చించనున్నాయి.

**విశాఖ ప్రత్యేకతను చాటే కార్యక్రమాలు...!**



22న తోట్లకొండలో మొక్కల నాటే కార్యక్రమం, వారసత్వ ప్రదేశ సందర్శన, ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు. అనంతరం హోటల్ రాడిసన్ బ్లూలో యువజన మంత్రుల సమావేశం జరుగుతుంది. అదే రోజు రాత్రి హోటల్ నోవాటెల్‌లో ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలతో గాలా డిన్నర్ నిర్వహించనున్నారు. దీనిలో రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రి భాగస్వామ్యంకానున్నారు. 23వ తేదీ ఉదయం నిర్వహించనున్న బ్రిక్స్ ఫ్రెండ్‌షిప్ సైకిల్ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. నోవాటెల్ నుంచి రామకృష్ణ బీచ్ రోడ్, సబ్‌మెరైన్ మ్యూజియం, సీ హారియర్ ప్రాంతం మీదుగా సుమారు 5 కిలోమీటర్ల మేర ర్యాలీ కొనసాగనుంది. అనంతరం క్రీడా మంత్రుల సమావేశం, విశాఖలోని క్రీడా ప్రదేశాల సందర్శన వంటి కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాల సమన్వయకర్తగా జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వరనాయుడును నియమించారు. వివిధ శాఖలకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించి, ప్రతినిధుల రాక నుంచి తిరుగు ప్రయాణం వరకు ప్రతి అంశాన్ని పర్యవేక్షించేలా చర్యలు చేపట్టారు. బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వడం నగరానికి లభించిన అరుదైన గౌరవంగా నిలవనుంది. యువత, క్రీడలు, ఆవిష్కరణలు, అంతర్జాతీయ సహకారంపై ప్రపంచ దేశాల ప్రతినిధులు చర్చించే ఈ సమావేశాల ద్వారా విశాఖపట్నం తన అంతర్జాతీయ ప్రతిష్టను మరోసారి చాటుకోనుంది. అంతర్జాతీయ ప్రతినిధుల పర్యటనను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఇప్పటికే అధికారులతో సమీక్షించి, విమానాశ్రయం నుంచి ప్రతినిధుల బస, సమావేశ వేదికలు, పర్యటన ప్రాంతాల వరకు ఎక్కడా లోటుపాట్లు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వివిధ శాఖలకు ప్రత్యేక బాధ్యతలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసి, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసేలా చర్యలు చేపట్టారు.



## ఏ పి ఓమ్నిబస్ బిల్లుకు శాసనసభ ఆమోదం

### న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్

**అమరావతి, ఆగస్టు19( జయ జయహే )**

ఆంధ్రప్రదేశ్ ఓమ్నిబస్ (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) బిల్లు-2026కు శాసనసభ ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన శాసనసభ సమావేశాలు మూడవ రోజున స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లును న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రవేశపెట్టారు. మంత్రి ఫరూక్ ప్రవేశపెట్టిన బిల్లులోని ముఖ్యాంశాలను ప్రశంసిస్తూ వాటికి పూర్తి మద్దతు తెలుపుతూ బిల్లును ఆమోదించాలని ఎమ్మెల్యే రామాంజనేయులు కోరారు. ప్రతిపాదనలకు సభ్యుల ఆమోదంతో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. బిల్లును ప్రవేశపెట్టినప్పుడు మంత్రి ఫరూక్ శాసనసభలో బిల్లు ముఖ్య ఉద్దేశంతో పాటు అందుబాటులోకి వచ్చే సులభతరమైన విధానాలను వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లుతో రాష్ట్రంలో విశ్వాస-ఆధారిత నియంత్రణ చట్రాన్ని పెంపొందించుటకు, పౌరుల యొక్క జీవన సౌలభ్యాన్ని మెరుగుపరుచుటకు, మరియు కార్యకలాపాల నిర్వహణను వేగవంతం చేయుటను ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం సూచించిన నియంత్రణల సడలింపు, అనుసరణ భారాన్ని తగ్గించే సంస్కరణలను అమలు చేయడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని మంత్రి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ఫైర్ సర్వీస్ చట్టం-1999 క్రింద ఫైర్ సేఫ్టీ నిబంధనలకు అంతర్జాతీయ ప్రమాణాలు మరియు మార్గదర్శకాలు ఆధారంగా ఉండేలా చేసినట్లు, నేషనల్ బిల్డింగ్ కోడ్‌కు సంబంధించిన ప్రస్తావనలను తొలగించినట్లు, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ల పునరుద్ధరణ కోసం థర్డ్-పార్టీ ఫైర్ ఆడిట్ ఏజెన్సీలు అనే కొత్త విధానాన్ని ప్రవేశపెట్టి, వాటి ఎంపానెల్మెంట్కు సంబంధించిన అర్హతలు, ప్రమాణాలు, విధులు, పర్యవేక్షణ మరియు క్రమశిక్షణా నిబంధనలను చేర్చినట్లు మంత్రి పేర్కొన్నారు.

ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ సింగిల్ విండో క్లియరెన్స్ చట్టం- 2002 కింద పరిశ్రమలకు సంబంధించిన అనుమతులపై క్రమబద్ధమైన పర్యవేక్షణ, స్పష్టమైన అధికారాలతో పాటు తప్పనిసరి ఎస్కలేషన్ అథారిటీతో కూడిన రాష్ట్ర మరియు జిల్లా కమిటీలతో కూడిన రెండు అంచెల సంస్థాగత వ్యవస్థను ఏర్పాటు చేయడాన్ని ప్రతిపాదించామని వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ గ్యారంటీ చట్టం- 2017 లో సేవలు తిరస్కరించబడినప్పుడు లేదా నిర్ణీత గడువులో అందించనప్పుడు, దరఖాస్తుదారులు తామే స్వయంగా అప్పీల్ దాఖలు చేయాల్సిన అవసరం లేకుండా ఆటో-అప్పీల్ విధానం ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి ఫరూక్ వెల్లడించారు. ఏదైనా సేవ తిరస్కరించబడినా లేదా నిర్ణీత గడువులో అందించబడకపోయినా, అప్పీల్ స్వయంచాలకంగా దాఖలైనట్లుగా పరిగణించబడుతుందన్నారు. అప్పీలేట్ అథారిటీ 21 రోజుల్లోపు ఆ అప్పీల్‌ను పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. అవసరమైతే సేవను అందించమని ఆదేశించడంతో పాటు, పరిహారం చెల్లించాల్సిందిగా కూడా ఆదేశించవచ్చునని పేర్కొంటూ మంత్రి ఫరూక్ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లును ప్రవేశపెట్టగా శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.




## మాజీ సీఎం జగన్‌ను కలిసిన కొట్యాడ కుటుంబ సభ్యులు

**తాడేపల్లి (జయ జయహే)**

వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ను విశాఖ ఉత్తర నియోజకవర్గం సోషల్ మీడియా అధ్యక్షుడు కొట్యాడ సూర్య కుటుంబ సభ్యులు తాడేపల్లి కార్యాలయం లోని జగన్ మర్యాద పూర్వకంగా కలిశారు గతం లో సూర్య కుమార్తె కు మాజీ సీఎం జగన్ నామకరణం చేసిన విషయం ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు ఈ అవకాశన్ని కలిపించిన విశాఖ జిల్లా అధ్యక్షులు కె కె రాజు కు సూర్య కుటుంబ సభ్యులు ధన్యవాదములు తెలియజేసారు

## శ్రీవారి సన్నిధిలో డాక్టర్ గజల్ దంపతులు

**తిరుపతి, ఆగష్టు 19, జయ జయహే :**



ప్రముఖ గాయకుడు, కళాకారుడు గజల్ శ్రీనివాస్, ఆయన సతీమణి సురేఖ దంపతులు బుధవారం తిరుమల వేంకటేశ్వర స్వామి వారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. శ్రీవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. తిరుమల క్షేత్రం ఆధ్యాత్మికతకు, భక్తికి ప్రతీకగా నిలుస్తుండగా.. గజల్ శ్రీనివాస్ దంపతుల శ్రీవారి దర్శనం భక్తుల్లో ఆనందాన్ని కలిగించింది. కళారంగంలో తనదైన గుర్తింపు సంపాదించుకున్న గజల్ శ్రీనివాస్.. ఎప్పటికప్పుడు ఆధ్యాత్మికత, భారతీయ సంస్కృతి, సనాతన విలువలను తన గళం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వామివారి దర్శనం ఎంతో ప్రశాంతతను, ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో శ్రీవారి కరుణ, ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. "ఏడు కొండల వాడి సన్నిధిలో ఒక్క క్షణం కూడా జీవితాంతం గుర్తుండిపోయే అనుభూతే" అంటూ తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. శ్రీవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గజల్ శ్రీనివాస్ దంపతులు కోరుకున్నారు.

## డేటా పరుల చేతుల్లోకి జారుతోంది.. తస్మాత్ జాగ్రత్త!

**హెచ్. ప్రతాప్**



డిజిటల్ లావాదేవీలు విస్తరిస్తున్న కొద్దీ వ్యక్తిగత సమాచారం విలువ బంగారం కంటే ఎక్కువగా మారుతోంది. బ్యాంకు ఖాతాల వివరాలు, ఆధార్, పాన్, మొబైల్ నంబర్లు, వైద్య సమాచారం, ఆర్థిక లావాదేవీల వివరాలు వంటి అత్యంత సున్నితమైన సమాచారం నేడు డిజిటల్ రూపంలోనే నిల్వ అవుతోంది. ఈ నేపథ్యంలో 2026 జూలైలో వెలుగులోకి వచ్చిన బ్యాంక్ ఆఫ్ బరోడా డేటా లీక్ ఘటన దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించింది. ఒక ఉద్యోగి ఈ-మెయిల్ ఖాతా హ్యాక్ కావడంతో కొంత సున్నితమైన సమాచారం అనధికార వ్యక్తుల చేతికి చేరినట్లు బ్యాంకు ధ్రువీకరించింది. అయితే బ్యాంకు ప్రధాన వ్యవస్థకు ఎలాంటి నష్టం జరగలేదని స్పష్టం చేసింది. అయినప్పటికీ, వినియోగదారుల సమాచారం డార్క్ వెబ్‌లో ప్రత్యక్షమైందన్న వార్తలు డేటా భద్రతపై తీవ్ర ఆందోళనలకు దారితీశాయి.

భారత్‌లో ఇంటర్నెట్ వినియోగం, డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు వేగంగా పెరుగుతున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక రియల్‌టైమ్ డిజిటల్ చెల్లింపులు జరిగే దేశంగా భారత్ ఎదిగింది. అయితే డిజిటల్ విస్తరణకు అనుగుణంగా సైబర్ భద్రతా వ్యవస్థలు బలోపేతం కాకపోతే, ఒక్క డేటా లీక్ కూడా లక్షలాది మంది వ్యక్తిగత, ఆర్థిక జీవితాలను ప్రభావితం చేసే ప్రమాదం ఉంది.

డేటా లీక్ అంటే కేవలం సమాచారం బయటకు వెళ్లిపోవడం కాదు. దొంగిలించిన సమాచారాన్ని ఉపయోగించి సైబర్ నేరగాళ్లు నకిలీ రుణాలు పొందడం, ఫిషింగ్ దాడులు నిర్వహించడం, బ్యాంకు ఖాతాలను లక్ష్యంగా చేసుకోవడం, వ్యక్తుల గుర్తింపును దుర్వినియోగం చేయడం వంటి నేరాలకు పాల్పడవచ్చు. ఒకసారి వ్యక్తిగత సమాచారం డార్క్ వెబ్‌లోకి చేరితే, దాన్ని పూర్తిగా తొలగించడం దాదాపు అసాధ్యం.

ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ చట్టం--2023ను తీసుకొచ్చింది. సమాచార సాంకేతిక చట్టం--2000, జజు=ు-×అ మార్గదర్శకాలు, రిజర్వు బ్యాంకు సైబర్ భద్రతా నిబంధనలు కూడా అమలులో ఉన్నాయి. అయితే చట్టాలు రూపొందించడం మాత్రమే సరిపోదు. వాటి అమలు కూడా అంతే కఠినంగా ఉండాలి. డేటా రక్షణలో నిర్లక్ష్యం వహించే సంస్థలపై తగిన జరిమానాలు విధించడంతో పాటు, బాధ్యతను స్పష్టంగా నిర్ధారించడం, పారదర్శకంగా దర్యాప్తు చేయడం తప్పనిసరి.


ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులు, ప్రైవేటు సంస్థలు డేటా సమగ్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలి. సున్నితమైన సమాచారాన్ని బహుళస్థాయి గుప్తీకరణతో భద్రపరచడం, బహుళదశల ధ్రువీకరణను అమలు చేయడం, ఉద్యోగులకు నిరంతర సైబర్ భద్రతా శిక్షణ ఇవ్వడం, క్రమం తప్పకుండా భద్రతా తనిఖీలు నిర్వహించడం, కృత్రిమ మేధ ఆధారిత చొరబాటు గుర్తింపు వ్యవస్థలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు తప్పనిసరి కావాలి. ఒక ఉద్యోగి చేసిన చిన్న పొరపాటు కూడా కోట్లాది మంది సమాచారాన్ని ప్రమాదంలోకి నెట్టగలదనే విషయాన్ని ఇటువంటి ఘటనలు మరోసారి గుర్తుచేస్తున్నాయి.

డిజిటల్ ఆర్థిక వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలగాలంటే, తమ వ్యక్తిగత సమాచారం కూడా సురక్షితంగా ఉందన్న నమ్మకం ఉండాలి. అభివృద్ధి చెందిన దేశాలు సైబర్ భద్రతను జాతీయ భద్రతలో కీలక భాగంగా పరిగణిస్తున్నాయి. భారత్ కూడా అదే దిశగా మరింత పెట్టుబడులు, నైపుణ్యం, ఆధునిక సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించుకోవాలి.

డిజిటల్ యుగంలో డేటాయే కొత్త సంపద. ఆ సంపదకు సమర్థవంతమైన రక్షణ కల్పించలేకపోతే 'డిజిటల్ భారత్' లక్ష్యం అసంపూర్ణంగానే మిగిలిపోతుంది. డేటా గోప్యత, సమగ్రత, భద్రతలను కాపాడటం అంటే నేడు దేశ ఆర్థిక భద్రతను కాపాడటంతో సమానం.

# పరీక్షలు, నియామకాల్లో పారదర్శకత పాటిస్తేనే యువత భవిష్యత్తుకు భరోసా

**విద్య,ఉపాధి ఒక యువకుడి జీవితాన్ని మలిచే రెండు ప్రధాన స్తంభాలు.ముఖ్యంగా పేద,మధ్యతరగతి, కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించడం సామాజిక,ఆర్థిక ఎదుగుదలకు ముఖ్యమైన మార్గంగా భావిస్తారు.సంవత్సరాల పాటు చదువు, కోచింగ్, పుస్తకాలు, ప్రయాణం, వసతి వంటి ఖర్చులను భరిస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతారు.ఇలాంటి సమయంలో ప్రశ్నపత్రం లీక్ కావడం, పరీక్ష రద్దు కావడం, ఫలితాలు ఆలస్యం కావడం,మూల్యాంకనంపై వివాదాలు తలెత్తడం లేదా నియామక ప్రక్రియపై ఆరోపణలు రావడం ఇవి ఒక్క పరీక్షకు సంబంధించిన సమస్యలు కావు. ఇవి యువత భవిష్యత్తు, కుటుంబాల ఆర్థిక స్థితి, ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని ప్రభావితం చేసే అంశాలు.ఒక అభ్యర్థి నెలల తరబడి చదివిన సమయం తిరిగి రాదు.వయోపరిమితి దగ్గరపడుతున్న అభ్యర్థికి ప్రతి ఆలస్యం ఒక అవకాశాన్ని తగ్గిస్తుంది.**




దూర ప్రాంతాల నుంచి నగరాలకు వచ్చి కోచింగ్ తీసుకునే వారికి పునఃపరీక్ష మరింత ఆర్థిక భారంగా మారుతుంది.అందువల్ల పరీక్ష రద్దు చేయాల్సిన పరిస్థితి ఏర్పడినప్పుడు నిజాయితీగా పరీక్ష రాసిన అభ్యర్థులకు కలిగే నష్టాన్ని కూడా ప్రభుత్వ నిర్ణయాల్లో పరిగణనలోకి తీసుకోవాలి.పరీక్షా వ్యవస్థలో అక్రమాలు ఎందుకు జరుగుతున్నాయి? ఎవరు లీక్ చేశారు? అనే ప్రశ్నతో పాటు ఎక్కడ భద్రత విఫలమైంది?' అనే ప్రశ్న కూడా వేయాలి.పరీక్షల నిర్వహణలో 'చైన్ ఆఫ్ కస్టడీ' అనే భావనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రశ్నపత్రం తయారైన క్షణం నుంచి పరీక్ష ముగిసే వరకు దానిని ఎవరు చూశారు, ఎవరు మార్చారు, ఎప్పుడు తరలించారు, ఎక్కడ నిల్వ చేశారు అనే పూర్తి డిజిటల్ రికార్డు ఉండాలి. ప్రతి యాక్సెస్‌కు టైమ్ స్టాంప్, వ్యక్తిగత గుర్తింపు, భద్రతా లాగ్ ఉండాలి. మానవ పర్యవేక్షణతో పాటు సాంకేతిక ఆడిట్ కూడా ఉండాలి.కేవలం ప్రశ్నపత్రం లీక్ కాకుండా చూడటం సరిపోదు.మూల్యాంకనం చాల అత్యంత సున్నితమైన దశ. సమాధాన పత్రం ఎవరు మూల్యాంకనం చేశారో తెలుసుకోవాల్సిన అవసరం నియామక సంస్థ మాత్రం ఆ పూర్తి రికార్డును భద్రంగా ఉంచాలి. డిజిటల్ మూల్యాంకనం అయితే యాక్సెస్ లాగ్‌లు, బ్యాకప్‌లు, మార్పుల చరిత్ర ఉండాలి.నోటిఫికేషన్ వచ్చిన తర్వాత పరీక్ష ఎప్పుడు జరుగుతుందో, ఫలితాలు ఎప్పుడు వస్తాయో, నియామక ఉత్తర్వులు ఎప్పుడు ఇస్తారో స్పష్టత లేక అభ్యర్థులు సంవత్సరాల పాటు వేచి ఉండాల్సి వస్తుంది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు ఉండి కూడా నియామకాలు ఆలస్యం కావడం వల్ల ఒకవైపు పరిపాలనా సామర్థ్యం తగ్గుతుంది,మరోవైపు నిరుద్యోగ యువతలో నిరాశ పెరుగుతుంది.దీనికి పరిష్కారంగా ప్రతి రాష్ట్రం వార్షిక లేదా ద్వైవార్షిక 'జాబ్ క్యాలెండర్'ను చట్టబద్ధంగా ప్రకటించాలి.ఒక ఘటనపై విచారణ సంవత్సరాల పాటు కొనసాగితే, అసలు దోషులు శిక్షించబడేలోపు బాధిత అభ్యర్థుల వయస్సు, అవకాశాలు, ఉద్యోగ జీవిత ప్రణాళికలు మారిపోతాయి.అందుకే ప్రత్యేక దర్యాప్తు వ్యవస్థలు, కాలపరిమితి, మధ్యంతర నివేదికలు, బాధిత అభ్యర్థులకు స్పష్టమైన సమాచార వ్యవస్థ అవసరం. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఉంది. అదే సమయంలో పరీక్షలు, నియామకాలు వంటి సున్నితమైన అంశాల్లో నిర్ధారణ కాని ఆరోపణలను నిజాలుగా ప్రచారం చేయడం అభ్యర్థులకు మరింత గందరగోళం కలిగిస్తుంది. ప్రభుత్వం కూడా ఆరోపణలను కేవలం ఖండించడం కాకుండా, ప్రక్రియకు సంబంధించిన ధృవీకరించగల సమాచారాన్ని అందించాలి. స్వతంత్ర విచారణ జరిగితే దాని నివేదికను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. నమ్మకం మాటలతో కాదు---పారదర్శకతతో వస్తుంది. నియామక సంస్థల స్వతంత్రతను కూడా బలోపేతం చేయాలి. రాజకీయ మార్పులతో పరీక్షా విధానాలు మారకూడదు. కమిషన్లలో సాంకేతిక నిపుణులు, పరీక్షా భద్రత నిపుణులు, న్యాయ నిపుణులు ఉండే విధంగా సంస్థాగత సామర్థ్యాన్ని పెంచాలి. ఉన్నతాధికారుల నుంచి పరీక్షా కేంద్రంలోని సిబ్బంది వరకు ప్రతి ఒక్కరి బాధ్యత స్పష్టంగా ఉండాలి. తప్పు జరిగితే వ్యక్తిగత బాధ్యత నిర్ణయించే విధానం ఉండాలి.ఇక విద్యా వ్యవస్థతో ఉపాధి వ్యవస్థ మధ్య సంబంధాన్ని కూడా పునఃపరిశీలించాలి. లక్షలాది మంది యువత కొద్ది ప్రభుత్వ ఉద్యోగాల కోసం మాత్రమే సిద్ధమయ్యే పరిస్థితి ఏర్పడితే ప్రతి నియామక పరీక్షపై అసాధారణ ఒత్తిడి పెరుగుతుంది. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక శిక్షణ, ప్రైవేట్ రంగ ఉపాధి, స్వయం ఉపాధి, స్టార్టప్ అవకాశాలు, గ్రామీణ ఉపాధి వంటి మార్గాలను బలోపేతం చేయాలి. అయితే ఇవి ప్రభుత్వ నియామకాల్లో పారదర్శకతకు ప్రత్యామ్నాయం కావు.పరీక్షల అక్రమాల వల్ల యువతలో 'ప్రతిభతో కాక పరిచయాలతో ఉద్యోగం వస్తుంది' అనే భావన పెరగడం అత్యంత ప్రమాదకరం. ఆ భావన బలపడితే చదువుపై ఆసక్తి తగ్గుతుంది. నిజాయితీగా సిద్ధమయ్యే అభ్యర్థుల సంఖ్య తగ్గుతుంది. సమాజంలో ప్రతిభకు బదులుగా అనైతిక మార్గాలకు ప్రాధాన్యం పెరిగే ప్రమాదం ఉంటుంది. అందుకే పరీక్షా వ్యవస్థను కాపాడటం అంటే కేవలం ఉద్యోగ నియామకాన్ని కాపాడటం కాదు; సమాజంలో మెరిట్, న్యాయం, సమాన అవకాశాల విలువలను కాపాడటం.అందువల్ల భవిష్యత్తు కోసం కొన్ని స్పష్టమైన సంస్కరణలు అవసరం.విద్యార్థి, నిరుద్యోగ యువత భవిష్యత్తు ఏ ప్రభుత్వానికైనా అత్యంత విలువైన బాధ్యత. ఒక ప్రశ్నపత్రం లీక్ అయితే కేవలం కొన్ని ప్రశ్నలు బయటకు వెళ్లినట్లు కాదు వేలాది కుటుంబాల ఆశలు దెబ్బతింటాయి. ఒక నియామకంలో అక్రమం జరిగితే కేవలం కొన్ని పోస్టులే ప్రభావితం కావు ప్రజా పరిపాలనపై నమ్మకం దెబ్బతింటుంది. కాబట్టి 'పేపర్ లీక్ జరిగిన తర్వాత చర్య' అనే విధానం నుంచి 'లీక్ జరగకుండా వ్యవస్థ నిర్మాణం' వైపు ప్రభుత్వాలు మారాలి. విద్యకు విలువ, ప్రతిభకు గౌరవం, ఉపాధికి న్యాయం అనే మూడు సూత్రాలు పరీక్షా వ్యవస్థకు పునాదులుగా మారినప్పుడే యువతలో నమ్మకం తిరిగి నెలకొంటుంది.



**ఎన్.సీతారామయ్య**
**9440972048**

# మాతృభాష మాయమైతే... ఒక జాతి జ్ఞాపకమే మాయమవుతుంది

**(హెచ్. ప్రతాప్)**

**భాష చనిపోవడం అంటే మాట్లాడే పదాలు ఆగిపోవడం మాత్రమే కాదు. ఒక సమాజం తరతరాలుగా కూడబెట్టుకున్న చరిత్ర, జానపదం, సామెతలు, పాటలు, ఆచారాలు, ప్రకృతి జ్ఞానం, వైద్య పరిజ్ఞానం, జీవన విధానం---అన్నీ వాటితోపాటే మౌనమవుతాయి. అందుకే మాతృభాషల అంతర్ధానం మన ముందున్న సాంస్కృతిక సంక్షోభం.**




భారతదేశ భాషా వైవిధ్యం ఎంత విస్తృతమో 2011 జనగణనే చెబుతోంది. సేకరించిన మాతృభాషా సమాధానాలు 2,843గా నమోదయ్యాయి. భాషా విశ్లేషణ అనంతరం 1,369 మాతృభాషా రూపాలను గుర్తించగా, 1,474ను వర్గీకరించలేకపోయారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ అంతరించే భాషల పరిరక్షణ పథకం 117 ప్రమాదంలో ఉన్న భాషలను గుర్తించి వాటి వ్యాకరణం, పదకోశం, పాటలు, కథలు, మౌఖిక సంప్రదాయాలను భద్రపరుస్తోంది.

భాషలు ఎందుకు అంతరిస్తున్నాయి? ప్రధాన కారణం మరో భాషను నేర్చుకోవడం కాదు; తమ భాషను తరువాతి తరానికి అందించకపోవడమే. ఉపాధి, విద్య, పట్టణీకరణ కోసం ఆధిపత్య భాషలపై ఆధారపడటం; ఇంట్లో పిల్లలతో మాతృభాషకు బదులు ఇతర భాషల్లో మాట్లాడటం; చిన్న భాషలకు పాఠశాల విద్య, పరిపాలన, మాధ్యమాలు, డిజిటల్ వనరులు లేకపోవడం; వలసలు, చిన్న సమాజాల విచ్ఛిన్నం; తమ భాష మాట్లాడితే వెనుకబాటుతనంగా భావించే సామాజిక మానసికత---ఇవి కలిసి భాషా మార్పును వేగవంతం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వమే ప్రమాదంలో ఉన్న భాషలను గుర్తించడంలో 10,000 మందికంటే తక్కువ మంది మాట్లాడే భాషలకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొంటోంది.

యునెస్కో హెచ్చరిక మరింత లోతైనది. ఒక భాష కనుమరుగైతే ఆ సమాజం తన ప్రత్యేక ప్రపంచదృష్టి, చరిత్ర, సంస్కృతి, స్థానిక కథనాలు కోల్పోతుందని పేర్కొంది. ప్రపంచంలోని సుమారు 7,000 భాషల్లో దాదాపు సగం ప్రమాదంలో ఉన్నాయని కూడా యునెస్కో పేర్కొంది. 2022--2032ను స్థానిక, ఆదివాసీ భాషల అంతర్జాతీయ దశాబ్దంగా ప్రకటించడం ఈ సంక్షోభ తీవ్రతకు నిదర్శనం.

ఇక్కడ తెలుగు విషయానికి వస్తే ఒక కీలకమైన తేడాను గుర్తించాలి. తెలుగు అంతరించే భాష కాదు. 2011 జనగణనలో కోట్లాది మంది తెలుగును మాతృభాషగా నమోదు చేశారు. కాబట్టి తెలుగుకు తక్షణ అంతర్ధాన ముప్పు ఉందని చెప్పడం వాస్తవం కాదు. కానీ తెలుగు మాట్లాడే వారి సంఖ్య కంటే, తెలుగును పిల్లలకు బదిలీ చేసే కుటుంబాల సంఖ్యే భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఇంట్లో తెలుగు తగ్గడం, విద్యా--ఉపాధి రంగాల్లో ఇతర భాషల ఆధిపత్యం, డిజిటల్ ప్రపంచంలో నాణ్యమైన తెలుగు విజ్ఞాన వనరుల కొరత, పిల్లలకు తెలుగు పఠన అలవాటు తగ్గడం వంటి అంశాలు దీర్ఘకాలిక హెచ్చరికలు.

అందుకే పరిష్కారం ఇతర భాషలను వ్యతిరేకించడం కాదు. బహుభాషా సామర్థ్యంతో పాటు మాతృభాషా పునాదిని బలపరచడం. ఇంట్లో తెలుగు, పాఠశాలలో నాణ్యమైన తెలుగు విద్య, విజ్ఞానం--సాంకేతికతను తెలుగులో అందించడం, తెలుగు డిజిటల్ వనరులను విస్తరించడం, పిల్లలకు ఆధునిక సాహిత్యం అందించడం---ఇవే భాషను జీవంతో ఉంచే మార్గాలు. ఒక భాషను ప్రభుత్వం కాపాడలేదు; ఆ భాషలో తన బిడ్డతో మాట్లాడే తల్లి కాపాడుతుంది. మాతృభాషను మనం పుస్తకాల్లో భద్రపరచే వస్తువుగా కాకుండా, ప్రతిరోజూ జీవించే భాషగా ఉంచినప్పుడే మన సంస్కృతికి భవిష్యత్తు ఉంటుంది.



## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేసిన డా. కందుల

**విశాఖపట్నం (జయ జయహే)**

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు అన్నారు.32వ వార్డు నేరెళ్ల కోనేరు ప్రాంతానికి చెందిన కొట్నాల రవణమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.35, 400ల చెక్ ను అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ కొన్ని రోజులుగా ఆమె అనారోగ్య సమస్యలతో భాధపడుతుందని చెప్పారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ క్రమంలోప్రభుత్వ పరంగా ఆమెను ఆదుకోవడానికి ముందుకు రావడం జరిగిందన్నారు. ఈ మేరకు ఆమెకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద చెక్ అందజేయడం జరిగిందని వెల్లడించారు.విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సహకారంతో దక్షిణ నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందని చెప్పారు.ముఖ్యమంత్రి , ఉప ముఖ్యమంత్రి  ల సమర్ధవంతమైన నాయకత్వం ఇప్పుడు రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని వెల్లడించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే అనేక మార్పులు జరిగాయని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు ఈ కార్యక్రమంలో  బి.లక్ష్మీ, ఎస్.జానకి, కె.మనోహర్, సిపిఐ బుజ్జి, కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


# ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేస్తున్న జనరేషన్ జి

**మాజీ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు**

**గుంటూరు (జయ జయహే)**



నేపాల్, బంగ్లాదేశ్ లాంటి దేశాలతో సహా ఇటీవల తమిళనాడులో ప్రభుత్వాలు మారటంలో జనరేషన్ జి కీలకపాత్ర పోషించిందని,రానున్న రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రాజకీయ ముఖచిత్రాన్ని మార్చగలిగే శక్తి యువతకు మాత్రమే ఉందని శాసనమండలి మాజీ సభ్యులు,జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె. ఎస్. లక్ష్మణరావు తెలిపారు ఈనెల 18వ తేదీ మంగళవారం సాయంత్రం గుంటూరు బ్రాడీపేట లోని బాలానంద కేంద్రంలో రాజ్యాంగ చర్చా వేదిక ఆధ్వర్యంలో జనరేషన్ జి ఉద్యమం పై విశ్లేషణ అనే అంశంపై జరిగిన చర్చ గోష్టి కార్యక్రమానికి రాజ్యాంగ చర్చావేదిక అధ్యక్షులు నడింపల్లి గురుదత్తు అధ్యక్ష వహించారు.ప్రధాన వక్తగా హాజరైన కేఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ1998 నుండి 2012 మధ్య కాలంలో జన్మించిన యువతను జనరేషన్ జిగా పిలుస్తామని ఇటీవల రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నది జనరేషన్ జి యువతేనని, స్వేచ్ఛగా విషయాలను వ్యక్తపరుస్తూ వాళ్ళ ఆలోచనలకు తగ్గట్టుగా వేగంగా ఫలితాల కోసం పోరాడ టమే వీరి ప్రత్యేకత అని తెలిపారు. కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమస్ఫూర్తిని కొనసాగిస్తూ రాజకీయాలకతీతంగా విద్యావ్యవస్థలో పటిష్టమైన మార్పు కోసం జనరేషన్ జి ముందుకు రావడం ఆదర్శనీయమన్నారు. కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి ఆంధ్రప్రదేశ్ నుండి అతి స్వల్ప ఆదరణ లభించిందని, రాష్ట్రంలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వ కనుసన్నులలో నడుచుకోవడమే కారణమన్నారు. జన చైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ జనరేషన్ జి కి సిబిఐ, ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్,ఇన్కమ్ టాక్స్ లాంటి వాటి పట్ల ఏమాత్రం భయం లేదని, అవినీతిపరులైన రాజకీయ నేతలను నరేంద్ర మోడీ అమిత్ షాలు వీటిని ఆయుధాలుగా ఉపయోగించి గత 12 సంవత్సరాలుగా భయభ్రాంతులను చేస్తున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ నూతన ఉద్యమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు.సమాజంలో ఉన్న ప్రధాన సమస్యలపై అందర్నీ కలుపుకొని ఐక్యంగా ఉద్యమించటం కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమాన్ని రాజకీయ పార్టీగా మార్చబోమని ప్రకటించడం ఆదర్శనీయమన్నారు.సోషల్ మీడియా గణనీయంగా పెరిగి యువత చేతిలో ఉన్న స్మార్ట్ ఫోన్ ను ఆయుధంగా ఉపయోగించుకొని, కాక్రోజ్ జనతా పార్టీ ఉద్యమిస్తుందని కోట్లాదిమంది యువతను కదిలిస్తున్నారని వివరించారు.




## ప్రారంభమైన ఆర్ఎస్ఎస్

# అఖిలభారత బైటెక్

**విశాఖపట్నం, ఆగస్టు 19, జయ జయహే**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అఖిల భారత సమన్వయ బైఠక్ విశాఖపట్నం సమీపంలోని గుడిలోవలో గల 'విజ్ఞాన విహార్' పాఠశాలలో ప్రారంభమైంది. పూజ్యనీయ సర్ సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ జీ, గౌరవనీయ సర్ కార్యవాహ దత్తాత్రేయ హోసబలే జీలు భారత్ మాత చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఈ సమావేశాన్ని ప్రారంభించారు. ఈ బైఠక్ ఆగస్టు 21 సాయంత్రం వరకు కొనసాగనుంది.వార్షిక అఖిల భారత సమన్వయ సమావేశంలో సర్ సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ జీ, సర్ కార్యవాహ దత్తాత్రేయ హోసబలే జీలతో పాటు సహ సర్ కార్యవాహులు, ఇతర కేంద్ర కార్యవర్గ ప్రముఖులు పాల్గొంటున్నారు. సంఘ్ ప్రేరణతో పనిచేస్తున్న భారతీయ మజ్దూర్ సంఘ్, విశ్వహిందూ పరిషత్ , భారతీయ జనతా పార్టీ , అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ , భారతీయ కిసాన్ సంఘ్, రాష్ట్ర సేవికా సమితి వంటి 32 వివిధ సంస్థల జాతీయ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అఖిల భారత సంఘటన మంత్రులు, ఎంపిక చేసిన కీలక కార్యకర్తలు ఈ సమన్వయ బైఠక్‌కు హాజరవుతున్నారు. వివిధ సంస్థల నుంచి 49 మంది మహిళలతో సహా 253 మంది కీలక కార్యకర్తలు, అలాగే సంఘ్ కార్యవర్గ ప్రముఖులతో కలిపి మొత్తం 327 మంది ప్రతినిధులు ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

**కలెక్టర్ కె. వెట్రిసెల్వి.**

**ఏలూరు.జయ జయహే**

ఏలూరు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికలఅధికారిణి కె. వెట్రిసెల్వి పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా రాష్ట్ర ఎన్నికల కమీషనర్ కార్యాలయం నుండి స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ బాధ్యయుతమైన విధులతో కూడుకున్నదనిస్పష్టంచేశారు. ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు, సిబ్బంది నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలన్నారు. ఓటర్ల జాబితాలు, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, ఎన్నికల సామగ్రి సమీకరణ, సిబ్బంది, భద్రతా ఏర్పాట్లపై పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలన్నారు.ఏలూరు జిల్లా నుండి జిల్లా వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ, జిల్లాలో 541 గ్రామ పంచాయతీలలోని 5664 వార్డులలో ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామనిపేర్కొన్నారు



# పుష్కరిని అభివృద్ధికి రెండు లక్షలు విరాళం

**చోడవరం ఆగస్టు 19 జయ జయహే**

చోడవరం స్వయంభూ శ్రీ గౌరీశ్వర స్వామి సన్నిధిలో జరుగుతున్న పుష్కరిణి అభివృద్ధి పనుల నిమిత్తం చోడవరం కి చెందిన అరిపాక రమనాజీ నాగమణి దంపతులు ద్వారా 2 లక్షలు రూపాయలు విరాళం అందించారు. ఈ మొత్తాన్ని బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతికి అందజేశారు. సందర్భంగా దాతలను అభినందించారు.



# ఖండివరంలో పశు వైద్య శిబిరం

**మాడుగుల ఆగస్టు 19 జయ జయహే**

చీడికాడ మండలం కండివరం గ్రామానికి చెందిన విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ ఆర్థిక సహకారంతో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశు కేంద్రీకృత విధానంలో గ్రామం లో చేసిన సర్వే లో గుర్తించిన పశువులను ఎదకు తీసుకు వచ్చే క్రమంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి సహాయ సంచాలకులు డా.వి.చిట్టి నాయుడు హాజరై మాట్లాడుతూ రైతులకు ఎల్ నినో ప్రబావం, పశుగ్రాసం పెంపకం ప్రాము ఖ్యత, థైలేరియా వ్యాక్సిన్, లింగ నిర్ధారిత వీర్యం, ఏడాది కొక దూడ ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమానికి కండివరం ఎంపీటీసీ గంజి స్వాతి మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి సీడీసీ చైర్మన్ సుంకర శ్రీను పాల్గొన్నారు. ఈ పశు వైద్య శిబిరంలో 40 ఆవులకు, 20 గేదెలకు గర్భ కొశ వ్యాధులకు చికిత్స చెయ్యడం జరిగినది. 93 ఆవులు మరియు పెయ్యలకు తెలేరియా టీకాలు వేయడం జరిగినది. 83 పెద్ద పశువులకు, 38 పెయ్యలకు నట్టల నివారణ మందు పంపిణీ చెయ్యడం జరిగింది.ఈ కార్యక్రమంలో పశు వైద్యులు డా.గణేష్, పశు వైద్యులు డా.మణి లక్ష్మణ్, పి.సంతోష్, వెటర్నరీ అసిస్టెంట్, సిహెచ్. రమేష్ ఆఫీస్ సబార్డినేట్ ఏం శ్రీనివాసు ఏ హెచ్ ఏ జి రమేష్ వి.నరసింహ నాయుడు ఈ శిబిరంలో పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ బిసి ఓటర్ల గుర్తింపుపై ప్రత్యేక సర్వే

**మాడుగుల ఆగస్టు 19 జయ జయహే**



రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మాడుగుల మండలంలో ఎస్సీ ఎస్టీ బీసీ ఓటర్ల గుర్తింపు ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నట్టు ఎండి ఒ కే అప్పారావు బుధవారం తెలిపారు. గ్రామపంచాయతీ ఓటర్ల లిస్టులు పరిశీలించి వాటిలో ఎస్సీ, ఎస్టీ బీసీలను ఎరుపు మార్కుతో గుర్తించాలని సూచించారు. గ్రామ అభివృద్ధి అధికారులు ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఈ నెల 20వ తేదీ లోగా ఎస్సీ ఎస్టీ బీసీ ఓటర్ల ఇంటింట సర్వే నిర్వహించాలని, 21 22 తేదీల్లో గుర్తించిన ఎస్సీ ఎస్టీ బీసీ వాటర్లను రెడ్ మార్కుతో సూచించాలని, 23న గుర్తించిన వాటర్ లిస్ట్ ను గ్రామపంచాయతీలు వద్ద ఏర్పాటు చేయాలన్నారు. 24 నుంచి 26 వరకు ఓటర్ల జాబితా పై అభ్యంతరాలు స్వీకరించాలని, 27 నుంచి 31 వరకు వచ్చిన అభ్యంతరాలపై విచారణ జరిపి ఎస్సీ ఎస్టీ బీసీ గుర్తింపు కూడిన జాబితా పరిశీలించి తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ ఒకటి నుంచి నాలుగో తేదీ వరకు గ్రామ సభలో ఎస్సీ ఎస్టీ బీసీ ఓటర్ల జాబితా ధ్రువీకరించి, ఐదో తేదీన ఓటర్ల గుర్తింపుతో కూడిన తుది జాబితా ప్రచురించాలన్నారు. కాబట్టి సంబంధిత గ్రామ అభివృద్ధి అధికారులు సకాలంలో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు.




# పోలింగ్ స్టేషన్ల పరిశీలన..

**కొయ్యూరు : (జయ జయహే )న్యూస్ ఆగష్టు 20,**


రాబోయే ఎన్నికల నేపథ్యంలో కొయ్యూరు మండలం మాకవరం గ్రామంలోని పోలింగ్ స్టేషన్లను ఎంపీడీఓ జి.డి.వి. ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్లలోని భౌతిక సౌకర్యాలు, తాగునీరు, విద్యుత్, ర్యాంప్, టాయిలెట్లు తదితర మౌలిక వసతులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు పోలింగ్ స్టేషన్లలో పాటించాల్సిన నిబంధనలపై సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, వీఆర్వో, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# చింతలమ్మ ఘాట్ రోడ్డులో లారీ ప్రమాదం.. డ్రైవర్ మృతి

**కొయ్యురు : (జయ జయహే )న్యూస్ ఆగష్టు 20,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం చింతలమ్మ ఘాట్ రోడ్డులోని 4వ టర్నింగ్ వద్ద ఈరోజు ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఘోర లారీ ప్రమాదం జరిగింది.ఏపీ 07 టీజె 2075 నంబర్ గల లారీ జెడ్డంగి వద్ద ఎరువులు లోడ్ చేసుకుని నర్సీపట్నం వైపు వెళ్తుండగా, 4వ టర్నింగ్ వద్దకు వేగంగా వస్తూ డ్రైవర్ అదుపు చేయలేక రోడ్డు పక్కన ఉన్న కొండను ఢీకొట్టింది.అదే సమయంలో అటుగా వెళ్తున్న కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు ప్రమాదాన్ని గమనించి వెంటనే ఆగి సహాయక చర్యలు ప్రారంభించారు. ప్రయాణికుల సహాయంతో రక్షణ చర్యలు చేపట్టి, ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.లారీ క్యాబిన్‌లో డ్రైవర్ కాళ్లు ఇరుక్కుపోవడంతో జేసీబీ లు, ప్రొక్లైన్లు తెప్పించి లారీని తొలగించారు. కొయ్యూరు పీహెచ్ రాజేంద్రపాలెం వైద్యులు సంఘటనా స్థలానికి చేరుకొని క్లీనర్‌కు ప్రథమ చికిత్స అందించారు.ఈ సహాయక చర్యల్లో ఎంపీపీ బడుగు రమేష్ , టీడీపీ మండల అధ్యక్షులు చంద్రరావు, లోవరాజు, మరియు స్థానిక ప్రజలు పోలీసులకు సహకరించారు.మృతి చెందిన డ్రైవర్ సలపు కృష్ణ గా గుర్తించారు.మృతదేహాన్ని నర్సీపట్నం మార్చురీకి తరలించి ఇన్‌క్వెస్ట్ నిర్వహిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ప్రమాద సమయంలో తక్షణ స్పందనతో సహాయం చేసిన పోలీసులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానికుల సేవ అభినందనీయం.



# కార్మికుల బకాయి జీతాలు ఇప్పించండి

**ఎస్సీ కమిషన్ డైరెక్టర్ కు సిఐటియు వినతి**

**చోడవరం,ఆగస్టు19 ,జయ జయ హే**

గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులకు, ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్కు బకాయి పడ్డ జీతాలను వెంటనే ఇప్పించాలని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల కమిషన్ డైరెక్టర్ వారాడ సీతారాం కు సిఐటియు నాయకులు విన్నవించారు. బుధవారం చోడవరం వచ్చిన ఆయనను మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆరు నెలల నుంచి ఏడాదిగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్ గత ఐదు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వీరిలో అత్యధికమంది దళితులు, వెనకబడి తరగతుల వారని వీరికి ప్రతినెల జీతాలు వచ్చేటట్లుగా కమిషన్ డైరెక్టర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని విన్నవించారు. పంచాయతీ కార్మికులకు అత్యధిక పంచాయతీల్లో మూడు వేల నుంచి ఆరు వేలు రూపాయలు మాత్రమే అందుతుందని, పదివేల రూపాయలు ఇవ్వాలనే జీవోను అత్యధిక పంచాయతీల్లో అమలు చేయడం లేదని, జీతంతో పాటు హెల్త్ అలవెన్స్ 4000 రూపాయలు అదనంగా ఇవ్వాలని ఉత్తర్వులు సైతం అనేక పంచాయతీలో అమలు చేయకపోవడంతో పంచాయతీ కార్మికులు తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ప్రభుత్వం, ఎస్సీ కమిషన్ వెంటనే చర్యలు తీసుకొని బకాయిలున్న కార్మికులకు జీతాలు చెల్లించేటట్లు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిఐటియు మండల నాయకుల ఎస్వీ నాయుడు, కులవక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు ఈర్లి చిరంజీవి తదితరులు ఉన్నారు.

# చరిత్రను కళ్లముందు నిలిపేది... ఫోటోగ్రఫీ

## ముంచంగిపుట్టులో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం





**ముంచంగిపుట్టు, జయ జయహే :**

చరిత్రను కళ్లముందు సజీవంగా నిలిపే శక్తి ఫోటోగ్రఫీకి మాత్రమే ఉందని ఎస్సై పి. నాని అన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముంచంగిపుట్టు మండల కేంద్రంలో మల్టీ ఫోటోగ్రఫీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలకు చెందిన ఫోటో, వీడియో గ్రాఫర్ల ఆత్మీయ సమ్మేళనం బుధవారం ఘనంగా నిర్వహించారు. మల్టీ ఫోటోగ్రఫీ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు జి. సన్యాసిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ జాక్వెస్ మాండే డాగ్యూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్సై పి. నాని మాట్లాడుతూ కాలగర్భంలో కలిసిపోయిన చరిత్రను సజీవంగా నిలిపేది ఫోటో మాత్రమేనన్నారు. ఆధునిక యుగంలో ఫోటోగ్రఫీకి ఎంతో ప్రాధాన్యత ఉందని, ఎన్నో విలువైన జ్ఞాపకాలను ఎప్పటికీ పదిలంగా ఉంచే శక్తి ఫోటోకు ఉందని పేర్కొన్నారు. ఫోటో, వీడియో గ్రాఫర్లకు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

**నాటి ఫోటోగ్రఫీ జ్ఞాపకాలు నెమరువేసుకున్న సీనియర్లు**

ఈ సందర్భంగా పలువురు సీనియర్ ఫోటోగ్రాఫర్లు తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. బ్లాక్ అండ్ వైట్ ఫోటోగ్రఫీ కాలంలో ఎదుర్కొన్న కష్టాలను నేటి తరం ఫోటోగ్రాఫర్లకు వివరించారు. ఫోటోగ్రఫీని వృత్తిగా ప్రారంభించి అనంతరం వివిధ రంగాల్లో స్థిరపడినా, తమ జీవితాలకు అండగా నిలిచిన ఫోటోగ్రఫీని మాత్రం ఎప్పటికీ కొనసాగిస్తామని సీనియర్లు తెలిపారు.

**సీనియర్ ఫోటోగ్రాఫర్లకు ఘన సన్మానం**

మల్టీ ఫోటోగ్రఫీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ ఫోటోగ్రాఫర్లు పి. ప్రభాకర్ రావు, వంపూరి చలపతిరావు, వెంగడ రమేష్‌లతో పాటు ఎస్సై పి. నాని, డాక్టర్ ఆదిత్య వర్మ, పాత్రికేయులు మోహన్, రాంబాబు, సురేష్, అనిల్, యూనియన్ నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

కార్యక్రమంలో మల్టీ ఫోటోగ్రఫీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కొర్రా బాబూలాల్‌తో పాటు రెండు మండలాల సభ్యులు వి. చంద్రశేఖర్, బి. శ్రీనివాసరావు, జి. అనిల్, వి. రాము, ఎస్. అజయ్, వి. రాజు, వి. శివాజీ, జి. చరణ్, వెంకటేష్ పడాలి, ఆర్. చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



## నిడదవోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల కొరత

### వైద్యుల పోస్టులు భర్తీ చేయాలి. జువ్వల రాంబాబు

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

నిడదవోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న గైనకాలజిస్ట్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పట్టణ ప్రజల సంక్షేమ సంఘం అధ్యక్షులు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. సంఘం ప్రతినిధులు ఆసుపత్రిని పరిశీలించి రోగుల సమస్యలు, వైద్యులు, సిబ్బంది కొరతను తెలుసుకున్నారు. క్యాజువాలిటీలో బెడ్లు, టాయిలెట్ సౌకర్యం లేకపోవడం, గదులు సరిపోక రోగులకు వరండాలోనే వైద్యం అందించడం వంటి సమస్యలను గుర్తించారు. ఈ సమస్యలపై మంత్రి కందుల దుర్గేష్‌కు వినతిపత్రం అందించగా, అక్టోబర్ నెలాఖరులోగా ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చినట్లు రాంబాబు తెలిపారు. అలాగే ఆసుపత్రిని త్వరలో 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో గంటి కృష్ణ, పొదిలి శ్రీనివాసరావు, కె. గోపి, ఎన్.వి. సత్యనారాయణ పాల్గొన్నారు.




## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి

**ఏలూ2025రు -జయ జయహే**

అఖిల భారత యువజన సమాఖ్య అధ్యర్యంలో రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందుబుధవారం ధర్నా జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్ధ విధానాల కారణంగా యువత నిరుద్యోగం, ఉపాధి, వలసలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అఖిల భారత యువజన సమాఖ్య ఏలూరు జిల్లా కన్వినర్లొర్ల పాటి రాజు ఆందోళన వ్యక్తం చేసారు . ప్రతి సంవత్సరం కోట్లాది ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇచ్చిన ప్రభుత్వాలు, మరోవైపు ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. పోటీ పరీక్షల్లో జాప్యం, పేపర్ లీకులు, పరీక్షల రద్దు, నియామక ప్రక్రియలో అవకతవకల వల్ల నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన జాబ్ క్యాలెండర్రకారం 4 లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, కొత్త పరిశ్రమల ఏర్పాటు వంటి హామీలను వెంటనేఅమలుచేయాలని డిమాండ్ చేసారు. ఏలూరు జిల్లా కన్వినింగ్ కమిటీ మెంబెర్ కురెళ్ల వరప్రసాద్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏఐ వై ఎఫ్ మాజీ కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ ప్రసంగించారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య యువజన సమాఖ్య మాజీ నాయకులు భజంత్రి శ్రీనివాస్,నాగం అచ్చుత్, పార్టీ సభ్యులు బళ్ళ కనకదుర్గరావు, మావూరి విజయ, గొర్లి స్వాతి,ఉప్పులూరి కేశవ, అమర్, రమేష్ యువజన సంఘ సభ్యులు అంబేద్కర్ పిట్టా చందు కొండ శివమని జీజ్జువరపు సురేంద్ర, సన్నీ, కొండేటి విక్రమ్ ఏ నవీన్, టి గిరి, సాయి,ఎస్ సురేష్ ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు సిద్దుతదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ గంగాలమ్మ తల్లి అమ్మవారి వార్షికోత్సవం

**మునగపాక, ఆగస్టు 19, జయ జయహే:**

మండలంలో మూలపేట గ్రామంలో గల శ్రీ గంగాలమ్మ తల్లి అమ్మవారు రెండవ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు అభిషేకాలతో పాటు మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించడం జరిగింది. అదేవిధంగా గ్రామస్తులందరి సహాయ సహకారాలతో అమ్మవారికి పాదాలు కిరీటం త్రిశూలం ఇత్తడితో కొత్తగా తయారు చేయించి గ్రామం మొత్తం ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి అలంకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.






## జాతీయ అప్రెంటిస్‌షిప్ శిక్షణ పథకంపై అవగాహన

**విజయనగరం: (జయ జయహే)**

సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో బోర్డ్ ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ (సదరన్ రీజియన్), చెన్నై సహకారంతో జాతీయ అప్రెంటిస్‌షిప్ శిక్షణ పథకం -- అప్రెంటిస్‌షిప్ ఆధారిత డిగ్రీ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు విద్యాభ్యాసంతో పాటు పరిశ్రమ అనుభవం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. “విద్యా అభ్యసనాన్ని పరిశ్రమ అనుభవంతో అనుసంధానం చేసి నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించడం” అనే ఇతివృత్తంతో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆఫిషియేటింగ్ వైస్‌ఛాన్సలర్ ప్రొ. జితేంద్ర మోహన్ మిశ్రా మాట్లాడుతూ, విద్యార్థులు తరగతి గది జ్ఞానంతో పాటు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. అప్రెంటిస్‌షిప్ ఆధారిత డిగ్రీ కార్యక్రమం ద్వారా ప్రత్యక్ష పని అనుభవం లభించి, విద్యార్థుల నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం మరియు ఉపాధి సామర్థ్యం పెరుగుతాయని పేర్కొన్నారు. ముఖ్య అతిథి, బోర్డ్ ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ (సదరన్ రీజియన్), చెన్నై అసిస్టెంట్ డైరెక్టర్ రాజమణి రాజు అప్రెంటిస్‌షిప్ శిక్షణ లక్ష్యాలు, శిక్షణ విధానం, పరిశ్రమ అనుభవం మరియు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సాంకేతిక, వృత్తిపరమైన మరియు సంభాషణా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అప్రెంటిస్‌షిప్ ద్వారా విద్యార్థులు తమ విద్యా జ్ఞానాన్ని ఆచరణలో ఉపయోగించుకోవడంతో పాటు పరిశ్రమ అవసరాలను అర్థం చేసుకుని భవిష్యత్ ఉపాధికి సిద్ధం కావడంపై ప్రత్యేకంగా వివరించారు. రిజిస్ట్రార్ ఇన్‌చార్జి డా. శంకర్ రెడ్డి కొల్లే మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి నైపుణ్య ఆధారిత శిక్షణ ఎంతో అవసరమని అన్నారు. విద్యార్హతలతో పాటు ఆచరణాత్మక నైపుణ్యాలు, పని అనుభవం మరియు వృత్తిపరమైన దృక్పథం విద్యార్థుల ఉపాధి సామర్థ్యాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని జర్నలిజం విభాగాధిపతి డా. ఇపిల్లి తారకేశ్వర రావు సమన్వయం చేయగా అన్ని డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం కార్యకలాప ఆధారిత పద్ధతిలో నిర్వహించడంతో విద్యార్థులు చర్చలు, పరస్పర చర్యలు మరియు వివిధ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొని అప్రెంటిస్‌షిప్, నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాలపై అవగాహన పొందారు.



## టైక్వాండలో (కరాటే) గోల్డ్ మెడల్ సాధించిన పిఎంకె.తేజో మారుతి ప్రసాద్

**శ్రీకాళహస్తి, ఆగస్టు 19,జయ జయహే**

ఎంజీఎం జూనియర్ కాలేజ్ విద్యార్థి పిఎంకె.తేజో మారుతి ప్రసాద్.తిరుపతి జిల్లా స్థాయిలో జరిగిన టైక్వాండలో గోల్డ్ మెడల్ సాధించి, ఆగస్టు 21,22,23 తారీకులలో శ్రీకాకుళంలో జరగబోయే స్టేట్ లెవెల్కిఎంపికఅయ్యాడు. ఎంజిఎం ఇన్స్టిట్యూషన్స్ డైరెక్టర్ గుడ్లూరు ఐశ్వర్య ఎంజిఎం ఇన్స్టిట్యూషన్స్ చదువులతో పాటు ఆటలు కూడా ప్రాధాన్యం ఇస్తుందన్నారు. స్పోర్ట్స్ లో ఇంకా ముందుకెళ్లాలని విద్యార్థికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంజీఎం ఇన్స్టిట్యూషన్స్ కాలేజ్ ప్రిన్సిపల్ వి.ఎస్ రత్నం పాల్గొన్నారు.



## భాగ్యశ్రీ, ఆశ్రిత్ వత్సల్ రెడ్డిల వివాహ వేడుకకు హాజరైన బొజ్జల దంపతులు

**తిరుమల, ఆగస్టు 19,జయ జయహే**

తిరుమలలోని శ్రీ కృష్ణ రాజేంద్ర ఒడయార్ కర్ణాటక కళ్యాణ మంటపంలో ఎస్. భాగ్యశ్రీ, ఆశ్రిత్ వత్సల్ రెడ్డిల వివాహ వేడుకకు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి దంపతులు హాజరయ్యారు. వేడుకలో పాల్గొన్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే దంపతులు నూతన వధూవరులను అక్షింతలు వేసి, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించి తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

## 22న తొట్లకొండపై అనుమతులు లేవు

**విశాఖపట్నం, ఆగస్టు 19, జయ జయహే :**

నగరంలో బ్రిక్స్ బృందం పర్యటనలో భాగంగా ఈ నెల 22న తొట్లకొండ పైకి సందర్శకులకు అనుమతులు ఇవ్వరని వీఎంఆర్‌డీఏ కార్యదర్శి మురళీకృష్ణ తెలిపారు. బ్రిక్స్ బృందం నగర పర్యటనలో భాగంగా వీఎంఆర్‌డీఏకు చెందిన పర్యాటక ప్రాంతమైన తొట్లకొండను సందర్శించనుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 22న ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు తొట్లకొండపైకి సందర్శకులకు, పర్యాటకులకు అనుమతి ఉండవని స్పష్టం చేశారు. శనివారం మధ్యాహ్నం నుంచి తొట్లకొండపైకి యధావిధిగా అనుమతులు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని నగరవాసులు, సందర్శకులు దయతో గమనించాల్సిందిగా కోరారు.

## విశాఖలో ఆర్ఆర్‌బి ఏర్పాటు చేయండి..!

### చంద్రబాబు, పవన్ కళ్యాణ్, రైల్వే మంత్రికి లేఖ రాసిన కొణతాల

### ఆ లేఖను విడుదల చేసిన లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి

**విశాఖపట్నం, ఆగస్టు 19, జయ జయహే**



రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు (ఆర్ ఆర్ బి )ని విశాఖ లోనే ఏర్పాటు చేయాలని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్టవ్ కి లేఖ రాసారని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. బుధవారం ఉషోదయ జంక్షన్ లోక్ సత్తా కార్యాలయంలో ఆయన కొణతాల రాసిన లేఖలను విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ రైల్వే జోన్ విశాఖలో ఉంటే రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు కూడా విశాఖలో ఉంటేనే మంచిదని,ఆలా ఉండాలని దేశ వ్యాప్తంగా అదే పద్దతి కొనసాగుతుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం అమరావతిలో ఏర్పాటు చెయ్యాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం తనకి ఆశ్చర్యం కలిగించిందని, లోక్ సత్తా నుండి మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ,హోం మంత్రి వంగలపూడి అనిత,రాష్ట్ర బీజేపీ శాసనసభ పక్ష నేత విష్ణుకుమార్ రాజులకు చంద్రబాబు పై వత్తిడి తేవాలని వినతిపత్రం అందచేశామన్నారు. తరువాత నిరుద్యోగులు, పజా సంఘాలతో కలసి విశాఖపట్నం, విజయనగరం జిల్లా ల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చెయ్యడం జరిగిందని, ఉత్తరాంధ్ర లోని ఎమ్మెల్యేలు మంత్రులు, ఎంపీలు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు కి మాజీ మంత్రి అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాదిరిగా లేఖలు రాసి వత్తిడి తేవాలని భీశెట్టి కోరారు, ఉత్తరాంధ్ర లో లక్షలాది మంది నిరుద్యోగ యువత రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు ఏర్పాటు కోసం ఎదురు చూస్తూ పరీక్షల కోసం ఎదురు చూస్తున్నారని వారి ఆశలపై రాష్ట్ర ముఖ్య మంత్రి నీళ్లు చల్లడం సరికాదని అన్నారు ప్రజల పక్షాన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ముఖ్యమంత్రికి ఉప ముఖ్య మంత్రికి కేంద్ర రైల్వే మంత్రికి లేఖలు రాయడాన్ని భీశెట్టి అభినందించారు ఈ సమావేశంలో పార్టీ నాయకులు గొట్టాపు సుదీర్, జలంత్రి రామచంద్ర రాజు, వడ్డాది ప్రకాశరావు, చెన్నా వెంకటరావు, హ్యాపీ లైఫ్ సంస్థ అధినేత అయిక జ్ఞానేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు

# ఎంజీసీహెచ్ఆర్ఐలో 300 బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్లు

**- ఆంధ్రప్రదేశ్‌లో ఘనత సాధించిన తొలి ఆసుపత్రిగా రికార్డు**

**- అధునాతన క్యాన్సర్ చికిత్సలో కీలక మైలురాయి**

**- ఎండీ అండ్ చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ మురళీకృష్ణ**

**విశాఖపట్నం, ఆగస్టు 19, జయ జయ హే**




విశాఖలోని మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ( ఎంజీసీహెచఆరఐ )లో విజయవంతంగా 300 బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్లు పూర్తి చేసింది. ఈ ఘనత సాధించిన ఆంధ్రప్రదేశ్‌లోని తొలి ఆసుపత్రిగా ఎంజీసీహెచఆరఐ నిలిచింది. రక్త క్యాన్సర్లు, సంక్లిష్ట రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న పెద్దలు, చిన్నారులకు ప్రత్యేక ట్రాన్స్‌ప్లాంట్ సేవలు అందించడంలో ఆసుపత్రికి ఉన్న నైపుణ్యాన్ని ఈ మైలురాయి ప్రతిబింబిస్తోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డా. మురళీకృష్ణ వూన్నా మాట్లాడుతూ, 300 బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ల పూర్తి వెనుక మా వైద్య బృందం నైపుణ్యం, సమన్వయం, అంకితభావం, శ్రమ దాగి ఉన్నాయన్నారు. ప్రతి ట్రాన్స్‌ప్లాంట్ ఒక రోగి, వారి కుటుంబం మాపై ఉంచిన నమ్మకానికి ప్రతీక. అధునాతన వైద్యసేవలను ఈ ప్రాంత ప్రజలకు మరింత చేరువ చేయడానికి మేము కట్టుబడి ఉన్నామని తెలిపారు. మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ కార్యక్రమం ద్వారా లుకేమియా, లింఫోమా, మల్టిపుల్ మైలోమా, తలసేమియా, అప్లాస్టిక్ అనీమియా తదితర వ్యాధులకు చికిత్స అందిస్తున్నామని, పెద్దలు, చిన్నారుల కోసం ప్రత్యేక సేవలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. చీఫ్ మెడికల్ ఆంకాలజిస్ట్, హెమటో-ఆంకాలజిస్ట్ అండ్ దీమీ ఫిజీషియన్ డా. బాల స్టాలిన్ చౌదరి మాట్లాడుతూ 300 ట్రాన్స్‌ప్లాంట్ల అనుభవంతో సంక్లిష్ట రక్త సంబంధిత వ్యాధులకు సమగ్ర ప్రణాళిక, బహుళ విభాగాల సమన్వయంతో చికిత్స అందించే మా సామర్థ్యం మరింత బలోపేతమైందన్నారు. సీనియర్ క్లినికల్ హెమటాలజిస్ట్, హెమటో-ఆంకాలజిస్ట్ ఒ దీమీ ఫిజీషియన్ డా. చంద్రశేఖర్ బెండి మాట్లాడుతూ, "ట్రాన్స్‌ప్లాంట్‌కు ముందు రోగి సమగ్ర పరిశీలన నుంచి ట్రాన్స్‌ప్లాంట్ అనంతర సంరక్షణ వరకు అందిస్తున్న సమగ్ర సేవల్లో మా అనుభవానికి ఈ మైలురాయి నిదర్శనమని పేర్కొన్నారు. సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ అండ్ హెమటో-ఆంకాలజిస్ట్ డా. ప్రవీణ వూన్నా, మెడికల్ ఆంకాలజిస్ట్, పీడియాట్రిక్ హెమటో-ఆంకాలజిస్ట్ దీమీ స్పెషలిస్ట్ డా. రజనీ ప్రియ పాల్గొన్నారు.



## వామ్మో ఏసీపీ... కలెక్టర్ మీదే తోసేస్తారా...!

**- చెట్టును తీసేయాలని కలెక్టర్ ఆదేశిస్తారా**

**- పోలీసులను తీసుకొచ్చి మరీ ఏళ్ల నాటి చెట్టు తొలగింపు**

**- ఏసీపీపై గుర్రుగా వున్న స్థానికులు**

**విశాఖపట్నం, ఆగస్టు 19, జయ జయహే :**

చిన్న చెట్టు కూడా తొలగించలేవా...ఈ మాత్రం దానికి సర్వే అవసరమా అని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తనను మందలించారని, అందుకే ఈ చెట్టు తొలగించాలని జీవీఎంసీ అసిస్టెంట్ సిటీ ప్లానర్ తిరుపతి రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ చెట్టు తొలగించేందుకు జీవీఎంసీ ఉద్యోగులతో బుధవారం 25 వ వార్డు సీతంపేట రాజేంద్రనగర్‌కు వచ్చిన ఏసీపీ, జీవీఎంసీ అధికారులపై స్థానికులు ఎదురు తిరిగారు. అక్రమంగా భవనం నిర్మిస్తూ ఉంటే దాని జోలికి వెళ్లకుండా తమ ఇంటికి మార్గం లేదంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మామిడి చెట్టును తొలగించాల్సిన అవసరం ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. పైగా బీఏ నెంబర్ 1086/327/బీ జోన్ 3/ ఎస్‌టీఏ /2025 అనుమతులపై నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. 48 గజాల స్థలంలో అక్రమ భవనం నిర్మిస్తే కూలగొట్టాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు భూ కబ్జా దారులకు వత్తాసు పలుకుతూ....దశాబ్దాల కాలంగా ఉంటున్న చెట్టు అడ్డంగా ఉ ఒందంటూ దాన్ని తొలగించడం దారుణమన్నారు. పైగా అక్రమణల విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లకుండా జీవీఎంసీ అధికారులు చెట్టును బలి చేయడంపై మండిపడ్డారు. ఆఖరికి పోలీసులు రంగ ప్రవేశం చేసి స్తానికులను బెదిరించి ఆ చెట్టును తొలగించారు.

## 40వ డివిజన్‌లో ఉద్రిక్తత

**వైసిపి చేరికలను అడ్డుకున్న పోలీసులు.. భరత్ రామ్ అరెస్టు**

**రాజమహేంద్రవరం: జయ జయహే : ఆగస్టు 19:**



40వ డివిజన్ కృష్ణనగర్‌లో టిడిపి నాయకుడు కొల్లి నాని ఆధ్వర్యంలో సుమారు 300 మంది వైసిపి లో చేరే కార్యక్రమం సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడంతో వైసిపి నాయకులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. మాజీ ఎంపీ, వైసిపి సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్‌ను పోలీసులు అరెస్టు చేసి త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం భరత్ రామ్ జీపు నుంచే కొల్లి నానికి వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని భరత్ రామ్ తీవ్ర ఆరోపణలు చేశారు. తమపై దాడికి టిడిపి కార్యకర్తలను పోలీసులు ఉసిగొల్పారని ఆరోపిస్తూ, కూటమి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. రాజమహేంద్రవరం నగరానికి ఇంకా స్వాతంత్ర్యం రాలేదని ఎద్దేవా చేశారు. పోలీసుల తీరుపై రాజ్యసభ మాజీ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, వైసిపి పార్లమెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి శాంతియుత కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారని ఆరోపించారు.



## గొన్న ఇంజనీరింగ్ కాలేజీలో వ్యసన విముక్తి ప్రతిజ్ఞ

**అగనంపూడి, ఆగస్టు 19, జయ జయహే :**

జీవీఎంసీ 85 వార్డ్ గొన్నవానిపాలెం గొన్న ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీలో అగనంపూడి ఓం శాంతి దివ్య భవన్ ఆధ్వర్యంలో వ్యసన విముక్తి ప్రతిజ్ఞ కార్యక్రమం బుధవారం జరిగింది. కాలేజీ ప్రిన్సిపాల్ డా పిఎసఎన్ మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకి బానిస కాకుండా బాగా చదువుకొని చైతన్యవంతమైన పౌరులు బలమైన సమాజానికి తోడ్పడి దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు అగనంపూడి ఓం శాంతి దివ్యభావం ఇన్చార్జి బి కే రామకోటి మాట్లాడుతూ నాశముక్తి భారత్ అభియాన్ అండ్ మిషన్ స్పందన ఆధ్వర్యంలో విక్టరీ భారత దశగా ఒక ముందు అడుగు 10 కోట్ల వ్యసన విముక్తి చేసే ప్రపంచ దేశాల్లో మన భారతదేశం ఆదర్శంగా ఉండాలని ఆగస్టు 6న మన ప్రధాని మోడీ రాజస్థాన్ మౌంట్ అబూలో బ్రహ్మకుమారి సెంట్రల్ కేంద్రంలో ఈ ఉద్యమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా బ్రహ్మకుమారిస్ ఇంజనీరింగ్ కళాశాలలో సామాజిక కార్యక్రమంలో భాగంగా 10 కోట్ల వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేసే మహా ఉద్యమం ఆగస్టు 31 వరకు కొనసాగించడం జరుగుతుందన్నారు. అనంతరం కాలేజీ విద్యార్థులచే వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేయించారు. ఏ డి సి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలోయువత డ్రగ్స్ గంజాయి మద్యపానం కి బానిసై తమ నిండు నూరేళ్ల జీవితాన్ని పాడు చేసుకుంటున్నారని , నేటి పౌరులు మన దేశ సంపదని వారు సన్మార్గంలో నడిచి మన భారతదేశాన్ని ప్రగతి పదములు నడిపిస్తారని కోరారు విశాఖ జిల్లా హ్యూమన్ రైట్స్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్ సుబ్రమణ్యం ఓం శాంతి ప్రతినిధుల్లో కోట్ని నరసింహమూర్తి రాము ఇంజనీరింగ్ కాలేజీ ఎనఎసఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సిహెచ్ వెంకటకృష్ణ లెక్చరర్స్ కె.వి తులసి, వి మానస, ప్రసన్నకుమార్, దుర్గాభవాని ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు



## సీఐ తిలక్ ఆధ్వర్యంలో చోరీల ముఠా అరెస్ట్...

**10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం.. నిందితుల అరెస్ట్...**

**నిడదవోలు జయ జయ ప్రతినిధి:**

తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్,ఆదేశాల మేరకు కొవ్వూరు సబ్ డివిజన్ డి.ఎస్.పి,జి. దేవకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీకి గురైన 10 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.సీఐ పీవీజి. తిలక్ పర్యవేక్షణలో సమిశ్రగూడెం ఎస్సై సుందర బాలాజీ, ఉండ్రాజవరం ఎస్సైలు డి. రవికుమార్, రవీంద్ర మరియు సిబ్బంది భౌతిక, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి, వారి కదలికలపై నిఘా ఉంచి అరెస్ట్ చేశారు.నిందితులు రాత్రివేళల్లో తాళాలు వేసి ఉన్న మోటార్ సైకిళ్లను చోరీ చేసి, వాటిని తణుకుకు చెందిన తాళ్లపూడి సతీష్, ముక్కామలకు చెందిన దొంగ ప్రవీణ్ కుమార్ ద్వారా విక్రయించేవారని పోలీసులు తెలిపారు. మోటార్ సైకిళ్లతో పాటు ఇళ్లలో కూడా చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది.ఉండ్రాజవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని కాల్దారి గ్రామంలో జరిగిన ఇంటి దొంగతనం కేసులో బంగారు వస్తువులు ఏ-2 గౌతమ్ వద్ద ఉన్నట్లు గుర్తించగా, వాటి రికవరీ ఇంకా చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.




## హోం మంత్రి ఇలాకాలో తమ్ముళ్ల బరి తెగింపు

**లారీల అక్రమ గ్రావెల్ దందా**

**పోలీసులకు పట్టుపడ్డ 3 లారీలు**

**నక్కపల్లి , ఆగస్టు 19, జయ జయహే**

హోం మంత్రి అనిత ఇలాకాలో అక్రమ గ్రావెల్ దందా బయటపడింది. మంగళవారం అర్ధరాత్రి స్థానికులు ఇచ్చిన సమాచారంతో నక్కపల్లి పోలీసులు మూడు లారీల అక్రమ గ్రావెల్ ను సీజ్ చేశారు. తునికి చెందిన టిడిపి నాయకుడు ప్రైవేట్ లేఅవుట్ కోసం ఈ అక్రమ గ్రావెల్‌ను తరలిస్తున్నట్టు తెలిసింది. నక్కపల్లిలో పోలీసులు మూడు అక్రమ గ్రావెల్ లారీలను పట్టుకున్న విషయం తెలుసుకున్న మిగిలిన లారీల్లోని గ్రావల్ ను టోల్ గేట్ రోడ్డు పక్కన పడేసి వెళ్లిపోయినట్టు పోలీసులు గుర్తించారు. పాయకరావుపేట పంచదార ఫ్యాక్టరీ దగ్గర పోలవరం కాలవ నుంచి ఈ గ్రావెల్ ని తవ్వి తరలిస్తున్నట్టు స్థానికులు కనుగొన్నారు ఇప్పుటి వరకు 500 లారీలు గ్రావెల్ ని అక్రమంగా తరలించినట్టు అంచనా వేస్తున్నారు. తుని మండల టిడిపి అధ్యక్షులు చింతమనీడి సోమరాజు ( అబ్బాయి) పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కుప్పిశెట్టి వెంకటేష్ కలిసి అక్రమ గ్రావెల్ తవ్వకాలు చేపట్టినట్టు వార్తలు వస్తున్నాయి గుల్లిపాడు రైల్వే స్టేషన్ దగ్గర రైల్వే ప్లాట్ఫారం ఎత్తు చేయడానికి కూడా ఎనిమిది వేల లారీలు గ్రావెల్ ను పోలవరం కాలువ నుంచి అక్రమంగా తవ్వేసి తలించినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు ఈ వ్యవహారంలో కొప్పిశెట్టి వెంకటేష్ పి ఎ సి అధ్యక్షుడు దార్ల కృష్ణ కీలక పాత్ర పోషించినట్టు కూడా ప్రచారం జరుగుతుంది. హోంమంత్రి అనిత పేరు చెప్పి వీళ్లు ఈ గ్రావెల్ దందాను యధావిధిగా జరుపుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి ఈ గ్రావెల్ దందా పై విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నక్కపల్లి సిఐ జె.మురళి తెలిపిన వివరాల ప్రకారం మూడు లారీలను సీజ్ చేసి వేయింగ్ చేయగా వాటి బరువులు 36, 37 టన్నులు వచ్చాయని పేర్కొన్నారు. సదరు లారీ డ్రైవర్లు సమర్పించిన బిల్లులు, మైన్స్ శాఖ అధికారులకు పంపించి, వాటి చెల్లుబాటు, అనుమతించిన పరిమాణం, మట్టి తరలింపు మూలం మరియు గమ్యస్థానం తదితర వివరాలను పరిశీలించాలని, బిల్లులు, పరిశీలన అనంతరం నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలించినట్లు తేలితే సంబంధిత లారీ యజమానులు, డ్రైవర్లపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని మైన్స్ శాఖ వారికి కోరుతూ లెటర్ పంపించామన్నారు.



## స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు

**ఎన్డీఏ కూటమి చారిత్రాత్మక నిర్ణయం**

**టీడీపీ గుంటూరు బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య**

**గుంటూరు, ఆగస్టు 19, జయ జయహే**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ సదుపాయం కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల టీడీపీ గుంటూరు బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య హర్షం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ ఆఫీసులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మాజీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కనకాచారి, రాష్ట్ర కార్యదర్శి తాళ్ల వెంకటేష్ యాదవ్, జిల్లా అధ్యక్షులు వేములకొండ శ్రీనివాస్, గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ శైలజ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి సంజీవరావు, మాజీ కార్పొరేటర్ ఎలుక వీరాంజనేయులు, మాజీ కార్పొరేటర్ ఎల్లవుల అశోక్ తదితరులంతా పాల్గొన్న ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. బీసీలకు రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా మరింత ప్రాతినిధ్యం కల్పించి, గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వారి భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని లక్ష్మయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీలకు అధిక ప్రాతినిధ్యం బలమైన స్థానిక ప్రజాస్వామ్యం" అనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగడం అభినందనీయమని, ఈ నిర్ణయం ద్వారా వెనుకబడిన వర్గాలకు రాజకీయంగా మరిన్ని అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిన్న కొండలు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గట్టు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, 44వ డివిజన్ అధ్యక్షులు గడ్డం భద్రయ్య పలువురు నాయకులు పాల్గొన్నారు

## బీజేపీ చీఫ్ నబీన్‌కు శ్రీ విద్యా సర్వ మంగళ పీఠాధిపతి ఆశీర్వచనం

**పార్వతీపురం, ఆగస్టు 19, జయ జయహే**



భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్‌ని పార్వతీపురం పట్టణంలో శ్రీ విద్యా సర్వమంగళ పీఠాధిపతి, ప్రముఖ నాడీ జ్యోతిష్యులు రామానందనాథ మురపాక కాళిదాసు శర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేదోక్త ఆశీర్వచనాలతో జాతీయ అధ్యక్షులను ఆశీర్వదించిన పీఠాధిపతులు, అమ్మవారి శేషవస్త్రాలు, అమ్మవారి చిత్రపటాన్ని నితిన్ నబీన్ కి అందజేశారు. దక్షిణ భారతదేశంలో వికసిత్ భారత్ లక్ష్య సాధనకు, దేశ అభివృద్ధికి పీఠాధిపతుల అనుగ్రహం, అమ్మవారి ఆశీస్సులు ఉండాలని నితిన్ నబీన్ ఆకాంక్షించారు. దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించి ప్రజల సంక్షేమం మరింత ముందుకు సాగాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు.



# వెరైటీగా ఎగ్ పకోడి

## రుచి అదిరిపోతుంది అంతే!

పకోడీల్లో వెజ్ అండ్ నాన్ వెజ్ ఎన్నో వెరైటీలు తినే ఉంటారు. అయితే ఎప్పుడూ గుడ్డు పకోడి మాత్రం తిని ఉండరు. కోడి గుడ్లతో ఎలాంటి రెసిపీ తయారు చేసుకున్నా చాలా రుచిగా ఉంటుంది. ఒక్కసారి వండుకుంటే మళ్లీ మళ్లీ తినాలనిపిస్తుంది. అంతే కాకుండా వెరైటీగా కూడా ఉంటుంది. గెస్టులు ఎవరు వచ్చినా.. ఈజీగా ఈ స్నాక్ తయారు చేసి పెట్టొచ్చు. ఈ రెసిపీ కూడా ఎంతో సింపుల్‌గా తయారు చేసుకోవచ్చు. అయితే కేవలం గుడ్డులోని తెల్ల సొనతో మాత్రమే పకోడి తయారు చేయాలి.

**ఎగ్ పకోడీకి కావాల్సిన పదార్థాలు:**
కోడి గుడ్లు, కారం, ఉప్పు, పసుపు, అల్లం, వెల్లుల్లి తరుగు, బ్రెడ్ ముక్కలు, గరం మసాలా, కరివేపాకు, పచ్చి మిర్చి, రెడ్ చిల్లీ సాస్, కార్న్ ఫ్లోర్, చనగపిండి, ఆయిల్.

**ఎగ్ పకోడి తయారీ విధానం:**
ముందుగా గుడ్లను ఉడకబెట్టి పక్కకు పెట్టుకోవాలి. ఇప్పుడు పొట్టు తీసి.. పచ్చ సొనను తీసేసి.. కేవలం తెల్ల సొనను మాత్రమే తీసుకోవాలి. ఇప్పుడు దీన్ని ముక్కలుగా కట్ చేసి ఓ లోతైన గిన్నెలోకి వేసుకోవాలి. ఇప్పుడు ఇందులోనే కారం, ఉప్పు, పచ్చి మిర్చి, పసుపు, అల్లం, వెల్లుల్లి తరుగు, గరం మసాలా, కరివేపాకు, రెడ్ చిల్లీ సాస్, కార్న్ ఫ్లోర్, చనగపిండి, వేసి బాగా కలపాలి. ఆ తర్వాత బ్రెడ్ ముక్కలను మిక్సీలో వేసి పొడిలా తయారు చేయాలి.ఇప్పుడు ఈ పొడి కూడా గుడ్ల మిశ్రమంలో కలపాలి. ఆ తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి.. ఆయిల్ వేసి వేడి చేయాలి. ఆయిల్ వేడెక్కాక.. కలిపి పెట్టిన మిశ్రమాన్ని పకోడీల మాదిరిగా వేసుకోవాలి. అంతే ఎంతో రుచిగా ఉండే ఎగ్ పకోడా తయారు. సర్వింగ్ ప్లేట్ లోకి తీసుకుని.. సాస్‌తో తింటే చాలా రుచిగా ఉంటాయి. కావాలి అనుకుంటే ఈ పకోడాను చిల్లీ ఎగ్ పకోడాల కూడా తాళింపు పెట్టుకోవచ్చు.

# డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి ఎంతో మేలు





డ్రై ఫ్రూట్స్ మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. వీటిని తరచుగా ఆరోగ్యకరమైన స్నాక్స్‌గా తింటారు. జీడిపప్పు, పిస్తా, బాదం వంటి డ్రై ఫ్రూట్స్‌లో అనేక పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, జింక్, ఐరన్, విటమిన్ ఇ, బి12, డి, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్‌లు ఉంటాయి. ఈ పోషకాలన్నీ మన ఆరోగ్యానికి చాలా అవసరం. నిపుణులు తరచుగా ఎండిన పండ్లను నానబెట్టమని సిఫార్సు చేస్తారు. అందుకే ఇవి ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. అయితే డ్రై ఫ్రూట్స్‌ని నీటిలో లేదా పాలలో నానబెట్టడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి? పోషకాహార నిపుణుడు నమామి అగర్వాల్ నుండి తెలుసుకుందాం.

నీటిలో డ్రై ఫ్రూట్స్ : నీళ్లలో నానబెట్టిన డ్రై ఫ్రూట్స్ తినడం వల్ల ఫైటిక్ యాసిడ్ తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. నిజానికి ఈ యాసిడ్ మన పొట్టకు చాలా హానికరం. ఈ ఫైటిక్ యాసిడ్ అజీర్తిని కలిగిస్తుంది. ఎలాగైనా, నీటిలో నానబెట్టిన డ్రైఫ్రూట్స్ తినడం వల్ల పోషకాల శాతం పెరుగుతుంది. ఈ కారణంగా, నీటిలో నానబెట్టిన డ్రై ఫ్రూట్స్ తినడం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

డ్రై ఫ్రూట్స్‌ను పాలలో నానబెట్టండి : మీరు డ్రై ఫ్రూట్స్‌ని 1 గంటలోపు తినాలనుకుంటే వాటిని పాలలో నానబెట్టండి అని నిపుణులు అంటున్నారు. సాధారణ పాలు తాగడానికి ఇష్టపడని వారు దీనికి డ్రై ఫ్రూట్స్‌ను జోడించవచ్చు. ఇది పాల రుచిని కూడా పెంచుతుంది. ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటుంది. అలాగే డ్రై ఫ్రూట్స్ ను పాలలో కలిపి తింటే శరీరానికి ప్రొటీన్లు, క్యాల్షియం, మినరల్స్ ఎక్కువగా అందుతాయి. ఇది బరువు పెరగడానికి కూడా సహాయపడుతుంది.

దేనిలో నానబెట్టాలి?: నీటిలో లేదా పాలలో నానబెట్టిన డ్రై ఫ్రూట్స్ తినండి. ఇది ప్రతి వ్యక్తి అవసరాన్ని బట్టి ఉంటుంది. డ్రై ఫ్రూట్స్ తినడం ఆరోగ్యానికి లాభదాయకంగా పరిగణిస్తారు. అయినప్పటికీ పరిమిత పరిమాణంలో తినాలి.

# మసాలా పప్పు.. వావ్ అనాల్సిందే!



సాధారణంగా పప్పు అనగానే టమాటా పప్పు, ముద్ద పప్పు, పాలకూర పప్పు. ఇవే కాకుండా పప్పులో చాలా రకాల వెరైటీలు తయారు చేసుకోవచ్చు. ఇదే స్టైల్‌లో మసాలా పప్పు కూడా తయారు చేసుకోవచ్చు. ఈ పప్పును ఒక్కసారి రుచి చూశారంటే.. మళ్లీ ఇలాగే చేయమని చెప్తారు. అన్నం, పులావ్, రోటీ, చపాతీ ఇలా ఎందులోకైనా ఇది చాలా రుచిగా ఉంటుంది. ఇడ్లీ, పూరీ, దోశ వంటి వాటతో కూడా ఈ పప్పును తినొచ్చు. అంతే కాకుండా ఇది ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. ఇది చేయడానికి కూడా ఎంతో సమయం పట్టదు. చాలా సింపుల్‌గా తయారు చేసుకోవచ్చు. మరి ఈ మసాలా పప్పును ఎలా తయారు చేస్తారు? ఇందుకు కావాల్సిన పదార్థాలు ఏంటో ఇప్పుడు చూద్దాం.

**మసాలా పప్పుకు కావాల్సిన పదార్థాలు:**
కందిపప్పు, ఉల్లిపాయ, పచ్చి మిర్చి, కారం, ఉప్పు, పసుపు, గరం మసాలా, ధనియాల పొడి, అల్లం వెల్లుల్లి పేస్ట్, కరివేపాకు, కొత్తిమీర, ఆయిల్ లేదా నెయ్యి.

**మసాలా పప్పు తయారీ విధానం:**
ముందుగా కంది పప్పును ఉడక బెట్టి పెట్టుకోవాలి. ఇప్పుడు కడాయిలో ఆయిల్ లేదా నెయ్యి వేసి వేడి చేయాలి. ఇప్పుడు సన్నగా తరిగి ఉల్లిపాయలు, పచ్చి మిర్చి, కరివేపాకు వేసి రంగు మారేంత వరకూ వేయించాలి. ఇప్పుడు అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చి వాసన పోయేంతవరకు ఫ్రై చేసుకోవాలి. ఇది వేగాక.. పసుపు, ఉప్పు, కారం, గరం మసాలా, ధనియాల పొడి వేసి ఓ రెండు నిమిషాలు వేయించాలి. ఇప్పుడు ఉడకబెట్టిన కంది పప్పు వేసి బాగా కలుపుకోవాలి. ఈ పప్పును నీళ్లలా కాకుండా.. మరీ చిక్కగా కాకుండా కాస్త దగ్గరగా ఉడికించుకోవాలి. చివరిగా కొత్తి మీర వేసి సర్వ్ చేసుకోవాలి. అంతే ఎంతో రుచిగా ఉండే మసాలా పప్పు రెడీ. ఇది అందరికీ బాగా నచ్చుతుంది. అలాగే ఎందులోకైనా హ్యాపీగా తినొచ్చు. ఈ మసాలా పప్పు ఆరోగ్యానికి కూడా చాలా మంచిది.

# సీనియర్ జర్నలిస్ట్ రామలింగం కన్నుమూత

**రాజమహేంద్రవరం: జయ జయహే ఆగస్టు 18:**



నాలుగు దశాబ్దాలకుపైగా పాత్రికేయ రంగంలో విశేష సేవలందించిన సీనియర్ జర్నలిస్ట్, వెలుగు దినపత్రిక సంపాదకుడు దేవులపల్లి రామలింగం (60) మంగళవారం కాకినాడలోని ఓ ఆసుపత్రిలో కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కిర్లంపూడిలో జన్మించిన రామలింగం 1985లో ఆంధ్రభూమి ద్వారా పాత్రికేయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం డెక్కన్ క్రానికల్లో 1998 వరకు పనిచేశారు. ఆ తర్వాత ఉదయం దినపత్రికలో స్టాఫ్ రిపోర్టర్‌గా బాధ్యతలు చేపట్టి మహబూబ్‌నగర్‌తో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. 2002లోరాజమహేంద్రవరంలో వెలుగు దినపత్రికను ప్రారంభించి, చివరి వరకు దాని సంపాదకుడిగా కొనసాగారు. వార్తలను నిర్భయంగా, నిష్పక్షపాతంగా రాయడం, ముక్కుసూటి వ్యవహారశైలి, నిరాడంబర జీవనం ఆయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ఆయన ఎప్పుడూ ముందుండేవారు. పాత్రికేయ వృత్తినే జీవిత ధ్యేయంగా భావించిన రామలింగం, పత్రిక నిర్వహణ కోసం తన వ్యక్తిగత ఆస్తులను సైతంవినియోగించారు జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం గళమెత్తారు. ఆర్థిక ప్రయోజనాల కంటే విలువలకు, వృత్తి నిబద్ధతకు ప్రాధాన్యం ఇచ్చిన జర్నలిస్టుగా సహచరుల మన్ననలు పొందారు. రాజకీయ, సామాజిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ముద్రగడ పద్మనాభం, జక్కంపూడి రామ్మోహన్‌రావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తదితరులతో ఆయనకు సుదీర్ఘ పరిచయం ఉంది. రామలింగం మృతిపట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంతాపం వ్యక్తం చేశారు. రామలింగం మరణం తెలుగు జర్నలిజానికి తీరని లోటని, ఆయనతో కలిసి పనిచేసిన పాత్రికేయులు, మిత్రులు పేర్కొన్నారు. నిజాయితీ, ధైర్యం, నిరాడంబరత, వృత్తి పట్ల అంకితభావానికి ఆయన జీవితం ఆదర్శంగా నిలిచిందని నివాళులర్పించారు.





# ధవళేశ్వరంలో శ్రీవారి హుండీ లెక్కింపు

## రూ.3.63 లక్షల ఆదాయం

**రాజమహేంద్రవరం: జయ జయహే: ఆగస్టు 19**

ధవళేశ్వరం శ్రీలక్ష్మీ పద్మావతి గోదా ఆండాళ్ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో హుండీ ఆదాయ లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగ సురేష్, చైర్మన్ నీలి వీరకోటేశ్వరరావు పర్యవేక్షణలో ఉదయం 10 గంటలకు లెక్కింపు ప్రారంభమైంది. ఫిబ్రవరి 26 నుంచి ఆగస్టు 19 వరకు ఆరు నెలల కాలానికి సంబంధించిన హుండీ ఆదాయాన్ని లెక్కించగా మొత్తం రూ. 3,63,820 సమకూరినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు ఆకేటి దుర్గా పార్వతి, మద్దుల లక్ష్మి, కూరెళ్ల రామలక్ష్మి, యల్లపు లక్ష్మి, బీర జయప్రకాష్ నారాయణ, గుజ్జల సూర్యనారాయణ, దిండి జగదీష్, పిరిడి రవికిరణ్ బిజెపి నాయకురాలు పన్నాల లక్ష్మి తులసి, అభయాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ నాళ్ల రమేష్, అగస్త్వేశ్వర స్వామి ఆలయ చైర్మన్ అల్లంపల్లి ముత్యాలరావు, డైరెక్టర్ శ్రీదేవి, మాజీ చైర్మన్ సాధనాల శివ, ఇందల శ్రీనివాస్, ఏలూరి అశోక్, స్థానిక పోలీస్ సిబ్బంది, భక్తులు, గ్రామపెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com